RNI No: TELTEL/2022/83073

# వేద న్యూస్

దినపత్రిక

వరంగల్ | ఆదివారం | పేజీలు 8 | లింగబత్తిని కృష్ణ
సంపుటి: 4 సంచిక:87 | మార్చి 15, 2026 | వెల: రూ.3-00 | సీఎండీ & ఎడిటర్
9701923260



బుల్లెట్ నుంచి బ్యాలెట్ వరకు

## నా జీవితం

- ప్రజాస్వామ్యం ఇచ్చిన అవకాశాలతోనే మార్పు సాధ్యమైంది
- మహిళల ఆర్థిక సాధికారతపై ప్రభుత్వ చర్యలు
- మంత్రి సీతక్క
- షీ స్పార్క్స్ 2026 కార్యక్రమంలో ప్రసంగం

2లో



# రియల్ మాయ!

## ఉమ్మడి వరంగల్లో రెచ్చిపోతున్న రియల్ ఎస్టేట్ మాఫియా

- నగర శివార్లలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అక్రమ వెంచర్లు
- అనుమతులు ఉండవు.. నిబంధనలు బేఖాతరు
- మౌలిక వసతులు లేకున్నా అన్నీ ఉన్నాయంటూ ప్రచారం
- అందమైన బ్రోచర్లు.. ఆకట్టుకునే కొటేషన్లతో కస్టమర్లకు బురిడీ
- గుంటల లెక్కన రిజిస్ట్రేషన్ చేస్తూ అంటగడుతున్న వైనం
- వెంచర్ల పక్కనున్న సర్కారీ భూములను ఆక్రమించి విక్రయం
- కొన్న తర్వాత ఇబ్బందులు పడుతున్న అమాయక ప్రజలు

2లో

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**

ఓవైపు విస్తరిస్తున్న నగరం.. మరోవైపు పరుగులు పెడుతున్న జాతీయ రహదారులు.. ఇంకోవైపు పారిశ్రామికంగా మారుతున్న శివారు ప్రాంతాలు.. వెరసి ఉమ్మడి వరంగల్ జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగం ఇప్పుడు హాట్ కేకులా మారింది. అయితే ఇదే క్రేజ్‌ను పెట్టుబడిగా మార్చుకున్న కొంతమంది రియల్ మాఫియా, సామాన్యుల సొమ్ముతో అక్రమ వ్యాపారానికి తెరలేపింది. నిబంధనలకు పాతర వేస్తూ, అనుమతులు లేని వెంచర్లతో అమాయక కొనుగోలుదారులకు గాలం వేస్తోంది. కళ్లు చెదిరే గ్రాఫిక్స్‌తో కూడిన రంగుల బ్రోచర్లను చూపిస్తూ, పచ్చని పార్కులు, విశాలమైన రోడ్లంటూ మాయ మాటలతో నమ్మించి, తీరా ప్లాట్లు అంటగట్టాక కస్టమర్లను నట్టేట ముంచుతోంది. ముఖ్యంగా జీహెచ్‌ఎంసీ పరిధి మొదలుకుని హన్మకొండ, జనగామ జిల్లాల సరిహద్దుల వరకు ఎక్కడ చూసినా అక్రమ లేఅవుట్లే దర్శనమిస్తున్నాయి. సర్కారీ భూములను సైతం ఆక్రమించి, పట్టా భూములతో కలిపి విక్రయిస్తున్న ఈ మాఫియా ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. సాగు భూమిని ప్లాట్లుగా మార్చి గుంటల లెక్కన రిజిస్ట్రేషన్లు చేస్తూ, భవిష్యత్తులో ఇల్లు కట్టుకునేందుకు అనుమతులు రాకుండా కస్టమర్ల జీవితాలను ప్రశ్నార్థకం చేస్తోంది.



సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో

## బడ్జెట్ కార్యాచరణ సిద్ధం చేయాలి

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- పర్యావరణ పరిరక్షణ అటవీ అభివృద్ధిపై ప్రీ బడ్జెట్ సమీక్ష
- సచివాలయంలో ఉన్నతాధికారులతో విస్తృత సమావేశం
- అటవీ విస్తరణ, వన్యప్రాణి సంరక్షణపై సమగ్ర చర్చ

2లో



గ్యాస్ కొరతతో హాస్టళ్లలో

## కట్టెల పొయ్యిలపై వంట

- హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో పొగ
- కమర్షియల్ సిలిండర్ల కొరతతో ఇబ్బందులు

2లో



2లో

## చెత్త కుప్పల నుంచి కళాత్మక నిర్మాణాలు

హనుమకొండలో వేస్ట్ టు ఆర్ట్ కార్యక్రమం

## సామాన్యుడికి ఒక లెక్క.. సంపన్నుడికి మరో లెక్క

- చిన్నమొత్తం బకాయి ఉంటే హడావుడి
- పెద్ద మొత్తంలో బాకీ ఉన్నాచర్యలు నిల్
- 20వ డివిజన్ కార్పొరేటర్ రూ.59,836 పన్ను చెల్లింపు
- ఇంతకాలం చర్యలు ఎందుకు తీసుకోలేదంటూ ప్రశ్నలు

### వరంగల్ బల్దియాలో పన్నుల వసూళ్లపై విమర్శలు



బల్దియా అధికారులకు రూ.59,836 ఆస్తి పన్ను చెల్లిస్తున్న 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్ కుమార్

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి**

వరంగల్ బల్దియా పరిధిలో ఆస్తి పన్నుల వసూళ్లలో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిన్న మొత్తంలో పన్ను బకాయి ఉన్నా సామాన్య ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న బల్దియా సిబ్బంది, ప్రభావశీలులపై మాత్రం అదే కఠినత చూపడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొద్దిపాటి పన్ను బకాయి ఉన్న పేదల ఇళ్ల ముందు నోటీసులు అతికించడం, ఒత్తిడి తేవడం వంటి చర్యలు తీసుకుంటున్నారని స్థానికులు చెబుతున్నారు. అయితే పెద్ద మొత్తంలో బకాయి ఉన్న వారిపై మాత్రం అధికారులు పెద్దగా స్పందించడం లేదని విమర్శిస్తున్నారు. వరంగల్ బల్దియా పరిధిలోని 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్ కుమార్‌కు చెందిన ఆస్తి పన్ను రూ.59,836 పెండింగ్‌లో ఉండటం చర్చనీయాంశంగా మారింది. శనివారం వరంగల్ రాంకీ ప్రాంతంలోని తన స్వగృహంలో ఆయన ఆ మొత్తానికి సంబంధించిన చెక్‌ను బల్దియా అధికారులకు అందజేశారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు ఎవరైనా చెల్లించాల్సిందేనని ప్రజలు పేర్కొంటున్నారు. అయితే ఇంత పెద్ద మొత్తంలో పన్ను బకాయి ఉన్నప్పటికీ ఇంతకాలం వరకు బల్దియా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిన్న మొత్తంలో బకాయి ఉన్న పేదలపై కఠిన చర్యలు తీసుకునే అధికారులు, పెద్ద మొత్తంలో బకాయి ఉన్నవారిపై ఎందుకు అదే కఠినత చూపడం లేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. బల్దియా పన్నుల వసూళ్లలో పారదర్శకత పాటించాలని ప్రజలు కోరుతున్నారు.

వేద న్యూస్

ఆదివారం | మార్చి 15, 2026

## బుల్లెట్ నుంచి బ్యాలెట్ వరకు నా జీవితం

### షీ స్పార్క్స్ 2026 లో మంత్రి సీతక్క

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

బుల్లెట్ నుంచి బ్యాలెట్ వరకు తన జీవిత ప్రయాణం ప్రజాస్వామ్యం కల్పించిన అవకాశాల ఫలితమని తెలంగాణ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రంగాల్లో ముందంజలో ఉన్న మహిళా నాయకులను ఒక వేదికపైకి తీసుకువచ్చిన 'షీ స్పార్క్స్ 2026' కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఢిల్లీలోని ఐఐటీ ప్రాంగణంలో జాతీయ మీడియా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తన జీవిత ప్రయాణం, ప్రజాసేవలోకి వచ్చిన విధానం, మంత్రిగా తీసుకున్న కీలక నిర్ణయాలపై నిర్వాహకులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో మార్పు తీసుకురావడంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. వ్యాపారవేత్తలు, పరిశోధకులు, ఐటీ నిపుణులు, రచయితలు, కళాకారులు, పరిపాలనాధికారులు వంటి అనేక రంగాల్లో ప్రతిభ చూపుతున్న మహిళలను ఒకే వేదికపైకి తీసుకురావడం సంతోషకరమని అన్నారు. ఇలాంటి కార్యక్రమాలు మహిళల నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయడంలో సహాయపడతాయని చెప్పారు. తాను రాజకీయ కుటుంబం నుంచి రాలేదని, ములుగు జిల్లా జగ్గన్నపేట గ్రామానికి చెందిన ఆదివాసీ కుటుంబంలో జన్మించి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ ప్రజాసేవలోకి వచ్చానని గుర్తుచేశారు. ఒకప్పుడు అన్యాయం, దోపిడీకి వ్యతిరేకంగా నక్సలైట్ ఉద్యమంలో పనిచేసిన తన జీవితం తర్వాత ప్రజాస్వామ్య వ్యవస్థపై విశ్వాసం పెరిగి ప్రధాన ప్రవాహంలోకి వచ్చానని మంత్రి తెలిపారు. విద్య ద్వారా జీవితాన్ని మార్చుకోవచ్చని నమ్మి న్యాయ విద్యను అభ్యసించి న్యాయవాదిగా పనిచేశానని, అనంతరం ప్రజల సేవ కోసం ఎన్నికల రాజకీయాల్లోకి ప్రవేశించానని చెప్పారు.

## సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో బడ్జెట్ కార్యాచరణ సిద్ధం చేయాలి

### ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో పర్యావరణ మరియు అటవీ శాఖలకు సంబంధించిన ప్రీ–బడ్జెట్ సమీక్షా సమావేశాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క నిర్వహించారు. ఈ సమావేశంలో పర్యావరణ పరిరక్షణ, అటవీ విస్తరణ, హరితాభివృద్ధి కార్యక్రమాల అమలు, వన్యప్రాణి సంరక్షణ చర్యలు మరియు అటవీ వనరుల సమర్థ వినియోగంపై ఉన్నతాధికారులతో సమగ్రంగా చర్చించారు. రాబోయే బడ్జెట్‌లో పర్యావరణ పరిరక్షణకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. సమావేశంలో రాష్ట్రంలో పచ్చదనం పెంపు కోసం చేపడుతున్న కార్యక్రమాల పురోగతిని అధికారులు వివరించారు. అటవీ విస్తీర్ణాన్ని పెంచేందుకు చేపట్టిన ప్రణాళికలు, హరితహారం వంటి కార్యక్రమాల అమలు పరిస్థితులు, అడవుల సంరక్షణ చర్యలు వంటి అంశాలను సమీక్షించారు. అటవీ ప్రాంతాల్లో వృక్ష సంపదను పెంపొందించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు భవిష్యత్ తరాలకు సహజ వనరులను సంరక్షించాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వన్యప్రాణి సంరక్షణ అంశంపై కూడా సమావేశంలో విస్తృతంగా చర్చించారు. అడవుల్లో జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, వన్యప్రాణుల నివాస ప్రాంతాలను రక్షించే విధంగా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు.

## చెత్త కుప్పల నుంచి కళాత్మక నిర్మాణాలు

### హనుమకొండలో వేస్ట్ టు ఆర్ట్ కార్యక్రమం

**వేద న్యూస్, హనుమకొండ**

హనుమకొండ నగరంలో చెత్త కుప్పలుగా మారిన ప్రదేశాలను అందమైన కళాత్మక నిర్మాణాలుగా మార్చే 'వేస్ట్ టు ఆర్ట్' కార్యక్రమాన్ని నగర పాలక సంస్థలు చేపట్టాయి. ఇందులో భాగంగా హనుమకొండలోని జీవీ పాయింట్ వద్ద గతంలో చెత్త పడేసే ప్రదేశాన్ని పునర్వినియోగ పదార్థాలతో ఆకర్షణీయమైన కళాత్మక నిర్మాణాలుగా తీర్చిదిద్దుతున్నారు. ఈ చర్య నగరాన్ని శుభ్రంగా ఉంచడమే కాకుండా ప్రజల్లో పర్యావరణంపై అవగాహన పెంచే ప్రయత్నంగా భావిస్తున్నారు. ప్లాస్టిక్, ఇనుము, పాత వస్తువులు వంటి వ్యర్థ పదార్థాలను వినియోగించి వివిధ కళాకృతులను రూపొందిస్తున్నారు. ఈ విధంగా వ్యర్థాలను పునర్వినియోగం చేయడం ద్వారా పర్యావరణానికి మేలు కలుగుతుందని అధికారులు తెలిపారు. చెత్తగా భావించే పదార్థాలను సృజనాత్మక కళాఖండాలుగా మార్చడం ద్వారా ప్రజలకు సందేశం ఇవ్వడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యంగా పేర్కొన్నారు. హనుమకొండలోని జీవీ పాయింట్‌తో పాటు నగరంలోని ఇతర ముఖ్య కూడళ్లలో కూడా ఇలాంటి 'వేస్ట్ టు ఆర్ట్' ప్రాజెక్టులను చేపడుతున్నారు. నగరాన్ని అందంగా తీర్చిదిద్దడం, ప్రజల్లో పరిశుభ్రతపై చైతన్యం కల్పించడం మరియు పర్యావరణ పరిరక్షణకు ప్రోత్సాహం ఇవ్వడం ఈ కార్యక్రమం లక్ష్యం.

## హాస్టళ్లలో కట్టెల పొయ్యిలపై వంట

**వేద న్యూస్, హైదరాబాద్ ప్రతినిధి**

హైదరాబాద్ నగరంలో కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా ఐటీ కారిడార్ ప్రాంతాల్లో ఉన్న పీజీలు, హాస్టళ్లలో వంటలు చేసేందుకు గ్యాస్ అందుబాటులో లేకపోవడంతో నిర్వాహకులు కట్టెల పొయ్యిలను ఉపయోగించడం ప్రారంభించారు. ఈ పరిస్థితి కారణంగా భవనాల మధ్య నుంచి భారీగా పొగ వ్యాపిస్తున్న దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. గ్యాస్ సిలిండర్ల కొరత కారణంగా అనేక పీజీలు, హాస్టళ్లలో సాధారణ వంటలు చేయడం కూడా కష్టంగా మారింది. దీంతో నిర్వాహకులు తాత్కాలికంగా కట్టెల పొయ్యిలపై వంటలు చేయడం మొదలుపెట్టారు. అయితే ఈ విధంగా వంట చేయడం వల్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో పొగ వ్యాపించి స్థానికులకు అసౌకర్యం కలిగిస్తున్నట్లు తెలుస్తోంది. ఐటీ కారిడార్ ప్రాంతాల్లో ఉన్న భవనాల మధ్య నుంచి పొగ ఎగిసిపడుతున్న ఫొటోలు సోషల్ మీడియాలో విస్తృతంగా చర్చనీయాంశంగా మారాయి. గ్యాస్ కొరత ప్రభావం వల్ల కొన్ని పీజీలు, హాస్టళ్లలో టిఫిన్ సేవలు కూడా నిలిచిపోయాయి.



## గిరిజన గడ్డపై జనసేన కేతనం

**వేద న్యూస్, (ఎల్.కే) ప్రత్యేక ప్రతినిధి**

- ఓనూరులో పార్టీ 13వ ఆవిర్భావ వేడుకలు
- పతాకాన్ని ఆవిష్కరించిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్
- ఏజెన్సీ అభివృద్ధికి పెద్దపీట.. బీటీ రోడ్ల పరిశీలన
- రోడ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని అధికారులకు ఆదేశం
- వేడుకల్లో పాల్గొన్న మంత్రి నాదెండ్ల మనోహర్

జనసేన పార్టీ ప్రస్థానంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. పార్టీ 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అత్యంత వినూత్నంగా, సామాన్యులకు చేరువగా నిర్వహించాలన్న ఆశయంతో, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కళ్యాణ్ మారుమూల గిరిజన ప్రాంతాన్ని వేదికగా ఎంచుకున్నారు. పాడేరు నియోజకవర్గంలోని అత్యంత వెనుకబడిన గిరిజన గ్రామమైన ఓనూరులో పవన్ కళ్యాణ్ స్వయంగా పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆడంబరాలకు దూరంగా, అడవితల్లి ఒడిలో గిరిజన బిడ్డల మధ్య జరిగిన ఈ వేడుక కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ కార్యక్రమంలో పవన్‌తో పాటు రాష్ట్ర ఆహార పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా పాల్గొన్నారు.





### ప్రజా సమస్యల పరిష్కారమే పరమావధి

జెండా ఆవిష్కరణ అనంతరం జరిగిన సభలో జనసేన నేతలు మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భావం నాటి నుంచి నేటి వరకు 'ప్రజల పక్షం–ప్రజా క్షేమం' అనే నినాదంతోనే ముందుకు సాగుతున్నట్లు స్పష్టం చేశారు. కేవలం రాజకీయ అధికారం కోసం కాకుండా, వ్యవస్థలో మార్పు కోసం పవన్ కళ్యాణ్ పడుతున్న శ్రమను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ముఖ్యంగా నిర్లక్ష్యానికి గురైన ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై ప్రస్తుత ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటోందని, గిరిజనుల ఆత్మగౌరవాన్ని కాపాడటమే తమ లక్ష్యమని నేతలు ఉద్ఘాటించారు.

### అడవితల్లి బాటలో అడుగులు..

ఈ పర్యటనలో భాగంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గిరిజన ప్రాంతాల్లో రవాణా సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం 'అడవితల్లి బాట'లో భాగంగా ఏజెన్సీ ప్రాంతాల్లో నూతనంగా నిర్మించిన బీటీ రోడ్లను ఆయన స్వయంగా తనిఖీ చేశారు. అధికారులతో కలిసి రోడ్ల నిర్మాణ నాణ్యతను పరిశీలించిన ఆయన, అటవీ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం కేవలం ప్రయాణం కోసమే కాదని, అది గిరిజనుల వైద్యం, విద్య మరియు ఆర్థికాభివృద్ధికి వారధి అని పేర్కొన్నారు. పనుల్లో ఎక్కడా రాజీ పడకూడదని, గడువులోగా నాణ్యమైన రోడ్లను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

### మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

పాడేరు వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగునీటి వంటి కనీస వసతుల మెరుగుదలకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పవన్ కళ్యాణ్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా జనసైనికులు పర్యవేక్షించాలని పిలుపునిచ్చారు. మారుమూల పల్లెల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తేనే ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, ఆ దిశగా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని నేతలు స్పష్టం చేశారు. ఈ వేడుకలో భారీ సంఖ్యలో తరలివచ్చిన గిరిజనులు, తమ మధ్యకు వచ్చిన ఉప ముఖ్యమంత్రికి ఘనస్వాగతం పలికారు.

## రియల్ మాయ!

### ఉమ్మడి వరంగల్లో రెచ్చిపోతున్న రియల్ ఎస్టేట్ మాఫియా

- నగర శివార్లలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న అక్రమ వెంచర్లు
- అనుమతులు ఉండవు.. నిబంధనలు బేఖాతరు
- మౌలిక వసతులు లేకున్నా అన్నీ ఉన్నాయంటూ ప్రచారం
- అందమైన బ్రోచర్లు.. ఆకట్టుకునే కొటేషన్లతో కస్టమర్లకు బురిడీ
- గుంటల లెక్కన రిజిస్ట్రేషన్ చేస్తూ అంటగడుతున్న వైనం
- వెంచర్ల పక్కనున్న సర్కారీ భూములను ఆక్రమించి విక్రయం
- కొన్న తర్వాత ఇబ్బందులు పడుతున్న అమాయకులు

**వేద న్యూస్, ఫోకస్ టీమ్**



ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారం వేగంగా విస్తరిస్తోంది. నగర పరిధి విస్తరణ, కొత్త రహదారులు, జాతీయ రహదారి ప్రాజెక్టులు, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాలు రియల్ రంగానికి ఊపు తెస్తున్నాయి. అయితే ఇదే అవకాశాన్ని ఉపయోగించుకుని కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఉమ్మడి వరంగల్ జిల్లాలో అక్రమ వెంచర్లకు తెరలేపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోనూ, అటు వరంగల్, హన్మకొండ, జనగామ జిల్లాల శివారు ప్రాంతాల్లోనూ నాన్–లేఅవుట్ అక్రమ వెంచర్లు వెలుస్తున్నాయి. మండలాల పరిధిలోనూ అనేక కొత్త వెంచర్లు వెలుస్తున్నాయి. అయితే వాటిలో చాలావాటికి పూర్తి స్థాయి అనుమతులు లేకపోయినా ప్లాట్లు విక్రయిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. నగర శివారు ప్రాంతాల్లో వ్యవసాయ భూములను వెంచర్లుగా మార్చి ప్లాట్లు విక్రయించే ధోరణి పెరిగింది. దీనికి సంబంధించి నాలా కన్వర్షన్, పట్టణాభివృద్ధి సంస్థ అనుమతులు, గ్రామ పంచాయతీ అనుమతులు లేకపోయినా కొనుగోలు దారులకు ప్లాట్లు అంటగడుతున్నారు. ప్రత్యేకంగా బైపాస్ రోడ్లు, జాతీయ రహదారులు, కొత్త కాలనీల పరిసర ప్రాంతాల్లో అక్రమ వెంచర్లు ఎక్కువగా పుట్టుకొస్తున్నాయి. ఈ ప్రాంతాల్లో భూముల ధరలు పెరుగుతాయనే ప్రచారం చేస్తూ పెట్టుబడిదారులను ఆకర్షిస్తున్నారు. వ్యవసాయ భూములను కనీసం నాలా కన్వర్షన్ చేయకుండానే ప్లాట్లుగా మార్చేస్తున్నారు. లేఅవుట్‌లో వదలాల్సిన 10 శాతం ఓపెన్ స్పేస్ వదలకుండా ఆ స్థలాన్ని కూడా ప్లాట్లుగా మార్చి అమ్మేస్తున్నారు.

### రంగుల బ్రోచర్లు.. అందమైన కొటేషన్లు..

రియల్ మాయగాళ్లు తమ అక్రమ వెంచర్లను విక్రయించడానికి అత్యంత ఆకర్షణీయమైన అస్త్రంగా రంగుల బ్రోచర్లను వాడుకుంటున్నారు. కళ్లు చెదిరే గ్రాఫిక్స్‌తో, విశాలమైన రోడ్లు, పచ్చని పార్కులు, క్లబ్ హౌస్‌లు, స్విమ్మింగ్ పూల్స్ ఉన్నట్లు ఆ బ్రోచర్లలో ఒక అద్భుతమైన మాయా ప్రపంచాన్ని సృష్టిస్తారు. 'రేపటి నగరం ఇక్కడే ఉంది', 'మీ పెట్టుబడికి బంగారు భవిష్యత్తు' అంటూ ఊరించే కొటేషన్లతో సామాన్యులను ఆకర్షిస్తారు. అయితే, వాస్తవానికి క్షేత్రస్థాయిలో చూస్తే అక్కడ కనీసం విద్యుత్ స్తంభాలు గానీ, డ్రైనేజీ వ్యవస్థ గానీ ఉండవు. కేవలం కాగితాల మీద కనిపించే ఆ అందమైన రంగుల వెనుక, అనుమతులు లేని అక్రమ లేఅవుట్లు, వివాదాస్పద భూముల చేదు నిజం దాగి ఉంటుంది. అమాయక కస్టమర్లు ఆ మెరుస్తున్న బ్రోచర్లను చూసి భ్రమపడి, తమ జీవితకాల కష్టార్జితాన్ని ఎలాంటి అనుమతులు లేని వెంచర్లలో పెట్టుబడిగా పెట్టి చివరకు మోసపోతున్నారు.

### గుంటల లెక్కన రిజిస్ట్రేషన్

లేఅవుట్ పర్మిషన్ లేకపోవడంతో, ప్లాట్ల పేరుతో కాకుండా అగ్రికల్చర్ ల్యాండ్ (గుంటల లెక్కన) రిజిస్ట్రేషన్లు చేయించి తప్పుదోవ పట్టిస్తున్నారు. దీనివల్ల ఇల్లు కట్టుకోవడానికి పర్మిషన్లు రాక కొన్నవారు ఇబ్బందులు పడుతున్నారు. ముందుగా వ్యవసాయ భూములను తక్కువ ధరకు కొనుగోలు చేయడం.. ఆ భూమిని వెంచర్‌గా ప్రకటిస్తూ భారీ ప్రచారం చేస్తున్నారు. భవిష్యత్తులో రోడ్లు, కాలనీలు, పరిశ్రమలు వస్తాయని చెప్పి అమాయకులకు ప్లాట్లు అమ్ముతున్నారు. అడ్వాన్స్ తీసుకుని కొంతమందికి మాత్రమే రిజిస్ట్రేషన్ చేస్తూ మిగిలిన వారికి పత్రాలు లేక ఇబ్బందులు సృష్టిస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ఒకే భూమిని పలువురికి అమ్మిన ఘటనలు కూడా వెలుగులోకి వచ్చాయి. పాత పత్రాలను ఉపయోగించి రిజిస్ట్రేషన్ చేయించుకోవడం వంటి ఆరోపణలు సైతం ఉన్నాయి.

### ప్రభుత్వ భూములపై కన్నేసిన మాఫియా

ఉమ్మడి వరంగల్ జిల్లా శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ భూములే లక్ష్యంగా రియల్ మాఫియా సాగిస్తున్న అక్రమ దందా ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. వీరు అనుసరిస్తున్న ప్రధాన వ్యూహం.. మొదట రోడ్డుకు ఆనుకుని ఉన్న కొద్దిపాటి పట్టా భూమిని తక్కువ ధరకు కొనుగోలు చేయడం లేదా అగ్రిమెంట్ చేసుకోవడం. ఆ వెంటనే, ఆ ప్లాటుకు వెనుకనో లేదా పక్కనో ఉన్న విలువైన ప్రభుత్వ పోరంబోకు భూములను, గుట్టలను, చివరకు కుంటలు మరియు నాలాలను సైతం ఆక్రమించి తమ వెంచర్‌లో కలిపేసుకుంటున్నారు. బయటకు కనిపించే ఎంట్రన్స్ పట్టా భూమిది కాబట్టి అధికారులు కూడా అంత త్వరగా అనుమానించరనే ధీమాతో, రాత్రికి రాత్రే జేసీబీలతో చదును చేసి ప్లాట్లుగా మార్చేస్తున్నారు. ఇలా కబ్జా చేసిన సర్కారీ భూములకు కూడా నకిలీ డాక్యుమెంట్లు సృష్టించడం లేదా విక్రయ పత్రాల్లో తప్పుడు సర్వే నంబర్లు వేసి అమాయక కస్టమర్ల నెత్తిన రుద్దుతున్నారు. తీరా కొన్నాళ్ల తర్వాత ప్రభుత్వ అధికారులు ఆ భూమిని స్వాధీనం చేసుకోవడానికి వస్తే, చేతులు కాలిన కస్టమర్లు కోర్టుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడుతోంది.

## వృద్ధాప్యంలో కన్నతండ్రిని వేధిస్తున్న కొడుకులు

### బాధితుడి ఇంటి వద్దకే వెళ్లి కేసు నమోదు చేసిన పోలీసులు



**వేద న్యూస్, చిన్నకోడూరు**

ఆస్తి రాసిచ్చిన తర్వాత కన్నతండ్రి, తల్లిని పట్టించుకోకుండా, కనీసం తిండి కూడా పెట్టకుండా వేధిస్తున్న ఇద్దరు కొడుకులపై చిన్నకోడూరు పోలీసులు కేసు నమోదు చేశారు. సిద్దిపేట జిల్లాలోని గంగాపూర్ గ్రామానికి చెందిన కొండి నారాయణరెడ్డి (94)కు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు రాజిరెడ్డి సిద్దిపేటలో వ్యాపారం చేస్తుండగా, చిన్న కుమారుడు పరమేశ్వర్ రెడ్డి గంగాపూర్‌లోనే వ్యవసాయం చేస్తున్నాడు. నారాయణరెడ్డి తనకున్న సుమారు 7 ఎకరాల భూమిని ఇద్దరు కొడుకులకు సమానంగా (చెరి 3½ ఎకరాలు) రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. వయస్సు పైబడటంతో తమను చూసుకుంటారనే నమ్మకంతో ఆస్తిని కొడుకుల పేరున రాసిచ్చినప్పటికీ, తర్వాత వారు మాట మార్చారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. తమను ఒక పాత ఇంట్లో ఉంచి కనీస సౌకర్యాలు కల్పించకుండా, సరైన ఆహారం కూడా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ప్రశ్నిస్తే బూతు మాటలతో తిడుతూ చంపుతామని బెదిరిస్తున్నారని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయం తెలుసుకున్న సిద్దిపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీను, చిన్నకోడూరు ఉప పరిశీలకుడు చంద్రమోహన్ మానవత్వంతో స్పందించారు. బాధితుడు పోలీస్ స్టేషన్‌కు రాలేని స్థితిలో ఉండటంతో అధికారులు స్వయంగా నారాయణరెడ్డి ఇంటికి వెళ్లి ఫిర్యాదును స్వీకరించారు. నిస్సహాయ స్థితిలో ఉన్న వృద్ధులను వేధించడం చట్టరీత్యా నేరమని పేర్కొంటూ బాధ్యులైన ఇద్దరు కొడుకులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకుంటామని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీను వెల్లడించారు.

వేద న్యూస్

ఆదివారం మార్చి 15, 2026

# పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం

**– మెట్‌పల్లి మండలంలో 8 కేంద్రాలు ఏర్పాటు**

**వేద న్యూస్, మెట్‌పల్లి:**



మెట్‌పల్లి మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పరీక్షల నిర్వహణ కోసం మండలంలో మొత్తం 8 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో మెట్‌పల్లి పట్టణంలో 6 కేంద్రాలు ఉండగా, జగ్గాసాగర్ మరియు బండలింగాపూర్ గ్రామాల్లో ఒక్కో కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల్లో మొత్తం 1,692 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్షలు సజావుగా సాగేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతి కేంద్రంలో విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం మాత్రమే పరీక్షా హాల్లోకి అనుమతిస్తున్నారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు, విద్యాశాఖ అధికారులు కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టారు. మొత్తం పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

## ఉప సర్పంచుల ఫోరం

# మండల అధ్యక్షుడుగా పెరుమాండ్ల రంజిత్

**వేద న్యూస్, ఇల్లందకుంట:**



ఇల్లందకుంట మండల ఉప సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు గా ఇల్లంద కుంట గ్రామానికి చెందిన పెరుమాండ్ల రంజిత్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిదంగా గౌరవ అధ్యక్షునిగా ఆరేళ్ల రమేష్, ఉపాధ్యక్షునిగా కోడూరి చంద్రయ్య, కాసం ఇంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి గా చిట్ల వినీత శ్రీనివాస్, కార్యదర్శిగా కారట్లపెల్లి అక్షయ రాజు, వట్టేపెల్లి శరత్ చంద్ర,, కోశాధికారిగా కనుకుల తిరుపతి రెడ్డి,కార్యవర్గ సభ్యులుగా పెరుమాండ్ల మొండయ్య, కన్నూరి ప్రవీణ్, ఇంగిలే లక్ష్మణ్, గడ్డి మహేష్, మ్యాడ ద తిరుపతి రెడ్డి లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఉపసర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పెరుమాండ్ల రంజిత్ మాట్లాడుతూ.. ఉప సర్పంచ్ ల సమస్యల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# స్విమ్మింగ్ అసిస్టెంట్ గా దరఖాస్తుల స్వీకరణ

**వేద న్యూస్, మందమర్రి :**



మందమర్రి ఏరియాలోని సి ఈ ఆర్ క్లబ్ నందు గల స్విమ్మింగ్ పూల్ లో స్విమ్మింగ్ అసిస్టెంట్ గా పనిచేయడానికి ఏరియా నుండి దరఖాస్తులు కోరడమైనదని ఏరియా డీజీఎం పర్సనల్ సిహెచ్ అశోక్ తెలిపారు. శనివారం జిఎం కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ కార్మికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన స్విమ్మింగ్ పూల్ లో పనిచేయడానికి దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. స్విమ్మింగ్ అసిస్టెంట్ గా పని చేయటానికి స్విమ్మింగ్ నేషనల్ లైఫ్ సేవింగ్ సర్టిఫికెట్, సింగరే ణి సంస్థలో ఐదు సంవత్సరాల సర్వీస్, జనరల్ అసిస్టెంట్లు సర్వీ స్ మాత్రమే పైన తెలిపిన అర్హత కలిగిన కార్మికులు మందమర్రి జనరల్ మేనేజర్ కార్యాలయంలోని పర్సనల్ డిపార్ట్మెంట్ నందు మార్చి 18 తారీకు లోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు

**వేద న్యూస్, రుద్రూర్ :**



రుద్రూర్ మండల కేంద్రంలోని సులేమాన్ నగర్ గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శనివారం పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా 49 ఆవులు, గేదెలకు టీకాలు వేయడం జరిగిందని పశువైద్యాధికారి డాక్టర్ సంతోష్ కుమార్ తెలిపారు. ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువుల పెంపకం దారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సభ్యుడు గౌస్, పశువైద్య సిబ్బంది, పశువుల పెంపకం దారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బ మల్లన్న ఆలయంలో చైర్మన్ ప్రత్యేక పూజలు

**వేద న్యూస్, జమ్మికుంట:**



ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 1,2 వార్డులలో దుబ్బ మల్లికార్జున స్వామి వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పార్వతి సమేత రాజరాజేశ్వర స్వామి వారి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1,2 వార్డులను సందర్శించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ (దిలీప్) దుబ్బ మల్లికార్జున స్వామి ఆలయానికి వెళ్ళే దారి గుంతల మయమైనదని, రోడ్డు, లైట్ సౌకర్యం కావాలని.. అలాగే రెండు వార్డులకు ప్రధాన సమస్యగా ఎవరైనా వ్యక్తి పరమపదించినట్లైతే దహన సంస్కరణలు నిర్వహించటానికి వైకుంతధామము ఇబ్బంది గా ఉంది అని తెలిపారు. అలాగే రోడ్డు, డ్రైన్ గురించి కూడా తెలిపారు. దానికి సానుకూలంగా స్పందించిన (దిలీప్).. అతి త్వరలోనే అన్ని సమస్యలు పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్స్ పోలు దివ్య బిక్షపతి, పోల్నేనీ శిల్ప వేణుగోపాల్ రావు, ఫాజిల్,సత్యం,చందు,పవన్ తదితరులు పాల్గొన్నారు.

# చింతలపల్లిలో తొలి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం

**– పేదవారి ఇంటి కలను నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం**

**– ముఖ్యఅతిథిగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజి**

**వేద న్యూస్, ఎల్కతుర్తి:**



ఎల్కతుర్తి మండల పరిధిలోని చింతలపల్లె గ్రామంలో తొలి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజీ హాజరై గృహప్రవేశాన్ని నిర్వహించారు. ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారులు బుస్సారి రామారావు– రమ దంపతులు తమ సొంత ఇంటిలోకి అడుగుపెట్టడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సుకినే సంతాజీ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ పేదల సంక్షేమం కోసం కట్టుబడి పనిచేస్తున్నదని అన్నారు. పేదల సొంతింటి కలను నిజం చేయడానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. రానున్న రోజుల్లో మరింత మంది పేద కుటుంబాలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అవుతాయని, ప్రతి పేదవాడి ఇంటి కల నెరవేరేలా ప్రభుత్వం కృషి చేస్తున్నదని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇల్లు లభించడం తమ కుటుంబానికి ఎంతో ఆనందకరమైన విషయమని లబ్ధిదారులు బుసారి రామారావు రమ తెలిపారు. తమ సొంత ఇంటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చింది అని వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హింగే సంతాజీ ,యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, లోలేట చిరంజీవి అంబీరు రాములు, కుడితాడి మహేందర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామ పెద్దలు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గ్రామంలో తొలి ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం జరగడంతో గ్రామంలో ఆనంద వాతావరణం నెలకొంది.

# ఘనంగా జనసేన 13వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**వేద న్యూస్, వరంగల్ ప్రతినిధి:**



జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ జిల్లా జనసేన పీఓసీ సభ్యులు గడ్డం రాకేష్ ఆధ్వర్యంలో భద్రకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఆలయ ముఖద్వారం వద్ద మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా సీనియర్ నాయకులు డా.గోళ్ల రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న గ్రేటర్ వరంగల్ ఎన్నికల్లో జనసేన పార్టీ పోటీ చేస్తుందని తెలియజేశారు. పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న వారికి అవకాశం కల్పించబోతుందని ముందు ముందు జనసేన పార్టీలో పెద్దఎత్తున చేరికలు జరగబోతున్నాయని అని అన్నారు. అనంతరం గడ్డం రాకేష్ మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ ఎన్నికలే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాల్సిందిగా త్వరలో అన్ని డివిజన్ లో కమిటీలు వేసి భారీ సభను ఏర్పాటు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ముక్కా అభిలాష్, కొల్లూరి అనుదీప్,స్వర్గం హరిధర్, మేకల సురేష్ ,దినేష్,శివాజీ,కార్తీక్ దయాకర్,తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ ఏజెన్సీలపై అధికారులు చర్యలు తీసుకోవాలి

**– గ్యాస్ వినియోగదారుల నుంచి అధిక వసులు..!?**

**వేద న్యూస్, రుద్రూర్ :**



వంట గ్యాస్ వినియోగదారులకు గ్యాస్ ఏజెన్సీలు అదనపు భారాన్ని మోపుతున్నారు. ప్రతి ఇంటికి డెలివరీ చేయడానికి ఒక్కొక్క గ్యాస్ సిలిండర్ కు ప్రభుత్వం నిర్ణయించిన ధర కన్నా ఎక్కువ ధరకు గ్యాస్ సరఫరా చేస్తున్నారని రుద్రూర్ గ్రామానికి చెందిన వినియోగదారులు వాపోతున్నారు. బోధన్ నుండి రుద్రూర్ గ్రామానికి చేరడానికి 30 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారు. గ్యాస్ ధర 990 ఉన్నప్పటికీ దీక్షిత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మాత్రం అదనంగా 30 రూపాయలు వసూలు చేస్తున్నారు. నిబంధనల ప్రకారం 30 కిలోమీటర్ల లోపు ఉంటే పది రూపాయలు, 30 కిలోమీటర్లు దాటితే 15 రూపాయలు వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుంది. గ్యాస్ డెలివరీ పై ఒక్క రూపాయి కూడా చెల్లించవద్దని పదేపదే అధికారులు చెబుతున్నప్పటికీ గ్రామీణ ప్రాంతాలలో ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఈ విషయమై గ్యాస్ నిర్వాహకులకు పలుమార్లు విన్నవించినప్పటికీ ఫలితం లేకుండా పోతుంది. ఏజెన్సీల సహకారంతోనే డెలివరీ బాయ్స్ ఈ మొత్తం వసూలు చేస్తున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్యాస్ ఏజెన్సీ నిర్వహణపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# ఆయాల వేతనాలు ఇవ్వని అధికారులపై చర్యలు తీసుకోవాలి

**– ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య**

**వేద న్యూస్, మెట్‌పల్లి ప్రతినిధి:**



మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మెట్‌పల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న సుమారు 300 మంది ఆయాలకు జూలై 2024 నెలకు సంబంధించిన వేతనాలు ఇప్పటివరకు వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనమని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య అన్నారు. వేతనాలు నిలిపివేయడానికి కారణమేంటని పలుమార్లు సీడీపీఓ, డిడబ్ల్యూఓలను ప్రశ్నించినప్పటికీ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఆయాల వేతనాలను కావాలనే నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించిన ఆయన, ఈ విషయంపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని పెండింగ్‌లో ఉన్న ఆయాల వేతనాలను విడుదల చేసి, వారికి న్యాయం చేయాలని సమ్మయ్య విజ్ఞప్తి చేశారు.

# రంజాన్ పండుగ సందర్భంగా దుస్తుల పంపిణీ

**వేద న్యూస్, శంకరపట్నం:**



పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని శంకరపట్నం మండల కేంద్రంలోని కేశవపట్నం రైతు వేదికలో శనివారం ముస్లిం సోదరులకు దుస్తుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ముస్లిం సోదరులకు దుస్తులు అందజేసి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, అలాగే మానకొండూరు శాసనసభ్యులు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ సభ్యులు, మాజీ జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్, మండల అధ్యక్షుడు గోపగోని బసవయ్య గౌడ్, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వేద న్యూస్

ఆదివారం మార్చి 15, 2026

# ఫీజు కట్టకుంటే హాల్ టికెట్లు ఇవ్వం

- పరీక్షల వేళ పాఠశాలల ఫీజుల ఒత్తిడి
- ఆందోళనలో విద్యార్థులు
- అధికారులు దృష్టిసారించాలంటున్న తల్లిదండ్రులు




**వేద న్యూస్, చొప్పదండి:**

పరీక్షలు సమీపిస్తున్న వేళ ప్రైవేట్ పాఠశాలలు ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బకాయి ఫీజులు చెల్లించకపోతే హాల్ టికెట్లు ఇవ్వమని లేదా పరీక్షలకు అనుమతించమని హెచ్చరిస్తున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని పాఠశాలల్లో ఫీజులు పూర్తిగా చెల్లించని విద్యార్థులను తరగతుల నుంచి బయటకు పంపడం, పరీక్షల సమయంలో ప్రత్యేకంగా గుర్తించడం వంటి చర్యలు తీసుకుంటున్నట్లు సమాచారం. దీంతో పరీక్షలపై దృష్టి పెట్టాల్సిన విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పలువురు పేర్కొన్నారు. పరీక్షల సమయంలో ఫీజుల కోసం ఇంత ఒత్తిడి చేయడం వల్ల చదువుపై దృష్టి పెట్టడం కష్టమవుతోంది అని విద్యార్థులు వాపోతున్నారు. విద్యార్థులపై ఇలాంటి ఒత్తిడి చేయకుండా పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని విద్యా హక్కుల సంఘాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ విషయంపై సంబంధిత అధికారులు దృష్టి సారించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా, తెలంగాణలో ప్రైవేట్ పాఠశాలల ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం కఠిన చర్యలకు సిద్ధమవుతోంది. ప్రైవేట్ పాఠశాలలు వసూలు చేస్తున్న ఫీజుల వివరాలను అధికారులు సేకరిస్తున్నారు. ఫీజుల కమిషన్ ద్వారా ప్రతి ఏడాది ఫీజులను నిర్ధారించే విధంగా కొత్త చట్టం తీసుకురావాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు సమాచారం. ఇది అమల్లోకి వస్తే పిల్లలను చదివించే సగటు తల్లిదండ్రులకు కొంత ఉపశమనం లభించే అవకాశముంది.

## ఉద్యోగం లేక ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం కొదురుపాక గ్రామానికి చెందిన కాయితోజు శ్రీనివాస్ కుమారుడు కాయితోజు దిలీప్ (26) అనే యువకుడు ఉద్యోగం లేకపోవడం, కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడంతో తీవ్ర మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దిలీప్ ఎం.బి.ఏ చదివినప్పటికీ ఉద్యోగం దొరకకపోవడంతో కొంతకాలంగా ఆందోళనలో ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. శుక్రవారం రాత్రి ఇంట్లో ఉన్న ఇనుప రాడుకు ఉరివేసుకుని అతడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై అతని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు బోయినిపల్లి ఉప పరిశీలకుడు రమాకాంత్ తెలిపారు.

## మొదటి రోజు ప్రశాంతంగా ముగిసిన పది పరీక్షలు

**వేద న్యూస్, కోటగిరి :**



కోటగిరి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మొదటి రోజున పదవ తరగతి పరీక్షలు ప్రశంతంగా ముగిశాయి. జిల్లా పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ఆదేశాల మేరకు పరీక్ష కేంద్రం వద్ద ఎస్సై సునీల్ ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రం వద్ద విద్యార్థులకుఇబ్బందులు కలుగకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

## నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

**వేద న్యూస్, రామడుగు:**



మండల ఆర్ఎంపీ, పీఎంపీ సంఘం నూతన కార్యవర్గం శనివారం ప్రమాణ స్వీకారం చేసింది. సంఘ అధ్యక్షుడిగా మిట్టపల్లి బాబ్జీ, ప్రధాన కార్యదర్శిగా రమణ, కోశాధికారిగా నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సంఘ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి జోనల్ అధ్యక్షుడు మనోహర్, ఉపాధ్యక్షుడు సంజీవ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాసం రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరసింహరాజు, కోశాధికారి సంపత్ తదితరులు హాజరయ్యారు.

## ఇందిరమ్మ ఇంటికి గృహప్రవేశం

- ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన లబ్ధిదారులు

**వేద న్యూస్, బోయినిపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిర్మించిన కొత్త ఇంటికి గృహప్రవేశ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నిరుపేదలకు సొంత ఇల్లు కలను నిజం చేస్తూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గ్రామానికి చెందిన సుంకపాక పద్మ-ప్రవీణ్ కుటుంబం తమ సొంత ఇంటి కలను సాకారం చేసుకుంది. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య, ఉపసర్పంచ్ పొత్తూరి శైలజ-రాజు, వార్డు సభ్యుడు పోలె శేఖర్ ఆధ్వర్యంలో రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన గృహప్రవేశ కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ మేడిపల్లి సత్యం చేసిన కృషిని కుటుంబ సభ్యులు స్మరించుకుని హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తమకు సొంత ఇల్లు కలగడానికి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అందించిన సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మిరుదొడ్డి శ్రీనివాస్, కుటుంబ సభ్యులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**వేద న్యూస్, చొప్పదండి:**



రాబోయే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సూచించారు. చొప్పదండి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, మండల ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. గ్రామాల వారీగా మంజూరైన ఉపాధి హామీ పనులు, సీసీ రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ పంచాయతీ భవనాలు, మహిళా సంఘ భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాబోయే రోజుల్లో కూడా మండలానికి మరిన్ని నిధులు మంజూరు చేసి అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన 60 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అలాగే చొప్పదండి వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వడ్లూరి సరిత, వైస్ చైర్‌పర్సన్ పెరుమాండ్ల మానస, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొత్తూరు మహేష్, మండల కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డెమోక్రటిక్) జిల్లా కమిటీ ఏర్పాటు

**వేద న్యూస్, చొప్పదండి:**




పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డెమోక్రటిక్) ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు. తెలంగాణ జోనల్ కార్యదర్శి హరీష్ సహాయ, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శేషగిరిరావు, ప్రధాన కార్యదర్శి సంజీవ్ రావు, తెలంగాణ వ్యవస్థాపక కార్యదర్శి పోతునూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కమిటీని ప్రకటించారు. ఈ కమిటీలో జిల్లా కన్వీనర్‌గా రామడుగు మండలం శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన సంటి శ్రీనివాస్‌ను, సహ కన్వీనర్‌గా బందారావు రాజబాబు గౌడ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డెమోక్రటిక్) పార్టీ గుర్తు పండ్ల బుట్టతో హుస్నాబాద్, చొప్పదండి, హుజురాబాద్, పరకాల, పెద్దపల్లి నియోజకవర్గాలతో పాటు పార్లమెంట్ స్థానాల్లో కూడా పోటీ చేయనున్నట్లు తెలిపారు. రాజ్యాంగబద్ధంగా బడుగు, బలహీన వర్గాలకు రాజకీయ చైతన్యం కల్పించడం, సామాజిక అసమానతలను తొలగించి ప్రజలను ఐక్యం చేయడం పార్టీ ప్రధాన లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు.

# సహజ సంపదను కాపాడుకుందాం

- పత్తిపాకలో ఏర్పాటు చేస్తున్న క్రషర్‌ను నిలిపివేయాలి
- టీసీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి వంగరి సాంబయ్య

**వేద న్యూస్, శాయంపేట:**

ప్రకృతి సహజ సంపదను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని తెలంగాణ సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి వంగరి సాంబయ్య అన్నారు. శాయంపేట మండలం పత్తిపాక గ్రామంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న క్రషర్ యూనిట్‌ను వెంటనే నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కొద్ది నెలల క్రితమే ఎన్నికైన గ్రామ ప్రజాప్రతినిధులు సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు గ్రామంలో జరుగుతున్న పరిణామాలను గమనించి స్పందించాలని సూచించారు. ప్రకృతి సహజ సంపదను దోపిడీదారులు స్వార్థ ప్రయోజనాల కోసం వినియోగించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. పత్తిపాక గ్రామ ప్రజలంతా కొత్త క్రషర్ ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, ఇది ప్రజల ఐక్యతకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. తమ కళ్ల ముందే జరుగుతున్న ప్రకృతి విధ్వంసాన్ని చూస్తూ ప్రజలు నిస్సహాయ స్థితిలో ఉన్నారని, అయినప్పటికీ గ్రామస్థులు సంఘటితంగా తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయడం మంచి పరిణామమని అన్నారు. గ్రామ ప్రజల అభిప్రాయాన్ని గౌరవించకుండా, వారి అభీష్టాన్ని పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఆయన విమర్శించారు. ప్రజల అభిప్రాయాలను

సేకరించకుండా తీసుకునే నిర్ణయాలకు భవిష్యత్తులో ప్రజల తీర్పు తప్పదని పాలకులు గుర్తుంచుకోవాలని సూచించారు. భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రజల సమస్యలపై స్పందిస్తూ ఉండడం మంచి పరిణామమని పేర్కొన్న ఆయన, పత్తిపాక గ్రామ ప్రజల నిర్ణయానికి కూడా మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వానికి ఆదాయం కోసం అనేక మార్గాలు ఉన్నప్పటికీ, ప్రజలకు మరియు ప్రకృతికి నష్టం కలిగించే విధానాలను ఉపసంహరించుకోవాలని వంగరి సాంబయ్య డిమాండ్ చేశారు.



## కేయూ మాజీ వీసీ లింగమూర్తి కన్నుమూత

- నేడు పోచమ్మకుంట వద్ద అంత్యక్రియలు

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



కాకతీయ విశ్వవిద్యాలయం ఎకనమిక్స్ విభాగానికి చెందిన విశ్రాంత ఆచార్యులు, మాజీ వైస్ చాన్సలర్ ఆచార్య ఎన్. లింగమూర్తి (75) శనివారం మధ్యాహ్నం హనుమకొండలోని భీమారం వద్ద ఉన్న తన స్వగృహంలో కన్నుమూశారు. గత కొద్ది నెలలుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆచార్య లింగమూర్తి నవంబర్ 2007 నుంచి నవంబర్ 2010 వరకు కాకతీయ విశ్వవిద్యాలయం 10వ వైస్ చాన్సలర్‌గా సేవలందించారు. తన విద్యా జీవితంలో భాగంగా క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్‌గా, యూజీసీ విభాగ సమన్వయాధికారిగా, దూర విద్యా కేంద్ర సంచాలకుడిగా, ఎకనమిక్స్ విభాగాధిపతిగా, సోషల్ సైన్సెస్ విభాగాల డీన్‌గా, పరీక్షల నియంత్రణ అధికారిగా, అలాగే ఖమ్మం పీజీ కళాశాల ప్రిన్సిపల్‌గా పలు బాధ్యతలు నిర్వర్తించారు. 2011 సంవత్సరంలో ఆయన ఉద్యోగ విరమణ చేశారు. ఆచార్య లింగమూర్తి మృతిపై కాకతీయ విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, విశ్రాంత ఉద్యోగుల సంఘ ప్రతినిధులు ఆచార్య ఏ. సదానందం, ఆచార్య సురేష్ లాల్, ఆచార్య రవీందర్, ఆచార్య సమ్మయ్య, ఆచార్య వెంకటనారాయణ, ఆచార్య నరసింహ చారి, ఆచార్య పి. శ్రీనివాసరావు, మాజీ రిజిస్ట్రార్ ఆచార్య ఏ. శంకరయ్య, ఆచార్య ఎం. సారంగపాణి తదితరులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బోధన, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు కూడా ఆయన మృతిపై విచారం వ్యక్తం చేశారు. ఆచార్య లింగమూర్తికి భార్యతో పాటు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. ఆయన అంత్యక్రియలు నేడు ఉదయం 11 గంటలకు హనుమకొండలోని పోచమ్మకుంట వద్ద నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

## అంజన్న ఆశీర్వాద యాత్రలో బోయినిపల్లి బీజేపీ నేతలు



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలానికి చెందిన భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నిర్వహిస్తున్న అంజన్న ఆశీర్వాద యాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు. యాత్రలో భాగంగా ప్రాంతంలోని పలు గ్రామాల ప్రజలను కలిసి వారి సమస్యలను తెలుసుకుంటూ, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించినట్లు పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బోయినిపల్లి మండలానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని యాత్రకు మద్దతు తెలిపారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ మేళ పోస్టర్ విడుదల

**వేద న్యూస్, కేయూ క్యాంపస్:**



కేయూ పరిధిలోని యూనివర్సిటీ విద్యా కళాశాలలో సోమవారం నిర్వహించనున్న టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ మేళ పోస్టర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నల్లాని శ్రీనివాస్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యూనివర్సిటీ విద్యా కళాశాల ఆధ్వర్యంలో టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ మేళను మార్చి 16వ తేదీ సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కళాశాల ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మేళలో బీఎడ్, ఎం.ఎడ్. విద్యార్థులు వ్యక్తిగతంగా మరియు జట్లుగా పాల్గొని వినూత్నమైన బోధన, అభ్యాస సామగ్రిని రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తయారుచేసిన వర్కింగ్ మోడళ్లు, డమ్మీ మోడళ్లు, నమూనాలు, వినూత్న చార్టులు మరియు ఇతర సృజనాత్మక బోధనాభ్యాస పద్ధతులను ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో సిద్ధం చేసి ప్రదర్శనకు ఉంచనున్నట్లు తెలిపారు. ప్రదర్శనలో ఉన్న మెటీరియల్‌ను పరిశీలన కమిటీ మూల్యాంకనం చేసి, ఎంపికైన విద్యార్థులకు విజేతలుగా ప్రశంసా పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కాకతీయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కే. ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానుండగా, గౌరవ అతిథిగా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం, విశిష్ట అతిథిగా యూనివర్సిటీ విద్యా కళాశాల డీన్ ఆచార్య ఎన్. రామనాథ్ కిషన్ పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె. వేణుమాధవ్, డాక్టర్ బండి వేణు, డాక్టర్ షమీమ్ సుల్తానా, డాక్టర్ ఎస్.ఎస్. స్వర్ణలత, డాక్టర్ డి. కళ్యాణి, జి. అపర్ణ దేవి, డాక్టర్ మాణిక్యం, పి. శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## మృతి చెందిన కుటుంబాలకు పరామర్శ



**వేద న్యూస్, చొప్పదండి:**

చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ గ్రామానికి చెందిన ప్రాణ స్నేహితులు చిలుక ప్రదీప్, తాటికొండ సన్నీ ఇటీవల చాకుంట ఎక్స్ రోడ్డువద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ ఘటనపై స్పందించిన కాంగ్రెస్ నాయకులు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తల రూ.10 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. ఉజ్వల భవిష్యత్తు ఉన్న యువకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం ఎంతో బాధాకరమని వారు పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు తమవంతు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు మరియు ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధాన్యం దుర్వినియోగం చేస్తే మిల్లర్లపై కఠిన చర్యలు తప్పవు

- ప్రభుత్వ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి
- పెండింగ్ కేసులపై వేగంగా దర్యాప్తు చేయాలి
- వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి



**వేద న్యూస్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి:**

రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం రైస్ మిల్లులకు అప్పగించిన తరువాత దానిపై ఎలాంటి అక్రమాలు, నిర్లక్ష్యం లేదా దుర్వినియోగం జరిగినా తీవ్రంగా పరిగణిస్తామని, అలాంటి చర్యలకు పాల్పడే మిల్లర్లపై కఠిన చర్యలు తప్పవని వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి హెచ్చరించారు. వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ భవనంలో శనివారం జిల్లా పరిధిలో పెండింగ్‌లో ఉన్న సీఎంఆర్ పడ్డీ కేసులపై పోలీసు అధికారులతో ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా విచారించి త్వరితగతిన పూర్తిచేయాలని సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ విధానాలను ఉల్లంఘిస్తూ రైతుల ధాన్యాన్ని దుర్వినియోగం చేసే రైస్ మిల్లులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రైతుల నుండి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు దుర్వినియోగం చేయడం, అక్రమంగా నిల్వలు దాచిపెట్టడం లేదా ప్రభుత్వానికి ఇవ్వాల్సిన బియ్యాన్ని ఇవ్వకుండా ఆలస్యం చేయడం వంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తామని తెలిపారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యం ప్రభుత్వానికి అప్పగించబడిన తర్వాత దానిని దుర్వినియోగం చేయడం లేదా నిల్వలు దాచిపెట్టడం వంటి చర్యలు తీవ్రమైన నేరాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ధాన్యాన్ని దుర్వినియోగం చేసే రైస్ మిల్లర్లపై చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంలో ఎలాంటి వెనుకంజ ఉండదని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ సమయానికి బియ్యాన్ని అప్పగించడం రైస్ మిల్లుల బాధ్యత అని, నిబంధనలు ఉల్లంఘించే వారికి చట్టం ముందు తప్పించుకునే అవకాశం ఉండదని ఎస్పీ సునీత రెడ్డి తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీ, వనపర్తి సీఐ రత్నం, కొత్తకోట సీఐ రాంబాబు, జిల్లాలోని ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.3

## 'ముద్దుబిడ్డ' కింద మహిళలకు ఉచిత ప్రసూతి సేవలు



**వేద న్యూస్, శాయంపేట:**

గ్రామ సర్పంచ్ చింతల ఉమా రవిపాల్ ఆధ్వర్యంలో కూరపాటి ట్రస్ట్ ఫౌండేషన్ ద్వారా గర్భిణీ మహిళలకు ముద్దుబిడ్డ పథకం కింద ఉచిత ప్రసూతి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సేవలలో భాగంగా ప్రతి శుక్రవారం హనుమకొండలోని కూరపాటి ఆసుపత్రిలో మహిళలకు ఉచిత ప్రసూతి (డెలివరీ), బాహ్య రోగుల చికిత్స మరియు అవసరమైన మందులు అందజేయనున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. డాక్టర్ రమేష్, డాక్టర్ రాధిక, డాక్టర్ శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో ఈ వైద్య సేవలు నిర్వహించబడుతున్నాయని తెలిపారు. గర్భిణీ మహిళలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని ఉచిత వైద్య సేవలను పొందాలని గ్రామ సర్పంచ్ చింతల ఉమా రవిపాల్ సూచించారు. కూరపాటి ట్రస్ట్ ఫౌండేషన్ ద్వారా అందిస్తున్న ఈ సేవలను ప్రాంతంలోని గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## మైనింగ్ కుట్రపై భక్తుల గర్జన

- కురుమూర్తి ఏడుకొండలను కాపాడాలంటూ భారీ నిరసన
- అనుమతులు వెంటనే రద్దు చేయాలని డిమాండ్
- 2023లో తవ్వకాలను అడ్డుకున్న స్థానికులు



**వేద న్యూస్, చిన్నచింతకుంట:**

మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ శివారులోని పవిత్ర క్షేత్రమైన కురుమూర్తి వెంకటేశ్వర స్వామి ఏడుకొండల్లో మైనింగ్ తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దని స్థానికులు, భక్తులు శనివారం భారీ ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. కురుమూర్తి స్వామి ఏడుకొండల పరిరక్షణ సమితి జిల్లా కార్యదర్శి నాగరాజు, రాచాల జనార్ధన్, జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతు, సుదర్శన్, బాలశివుడు, ఓబుల్ రెడ్డి, శ్రీశైలం, దయానంద్, గోవింద్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 1600 ఏళ్ల చరిత్ర కలిగిన కురుమూర్తి స్వామి క్షేత్రం తెలంగాణలో "పేదల తిరుపతి"గా ప్రసిద్ధి చెందింది. ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో జరిగే జాతరకు తెలంగాణతో పాటు పక్క రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వస్తారు. తిరుమల తరహాలోనే ఇక్కడ కూడా ఏడుకొండలు ఉండటం ఈ క్షేత్రానికి ప్రత్యేకతగా భావిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం 2024లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా సుమారు రూ.110 కోట్ల వ్యయంతో లిమిటెడ్ క్యారియర్ ఘాట్ రోడ్డుకు శంకుస్థాపన జరిగింది. అయితే అదే కొండల్లో మైనింగ్ తవ్వకాలు చేపట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న సమాచారం భక్తుల్లో తీవ్ర ఆగ్రహాన్ని రేపుతోంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మైనింగ్‌కు ఇచ్చిన అనుమతులను 2023లో స్థానికులు, భక్తులు తీవ్రంగా అడ్డుకున్నారు. ప్రస్తుతం మళ్లీ క్రషర్ మైనింగ్ కాంట్రాక్టర్ తవ్వకాలు ప్రారంభించేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కురుమూర్తి ఏడుకొండలు తమ విశ్వాసానికి, ఆత్మగౌరవానికి ప్రతీకలని పేర్కొంటూ వెంటనే మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోక్యం చేసుకోవాలని భక్తులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం అనుమతులు ఇస్తే భారీ ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్, హిందూ వాహిని, బజరంగ్ దళ్, బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక గ్రామస్తులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కురుమూర్తి స్వామి దేవస్థానంలో అన్నదానం

### - భక్తులు పాల్గొనాలని ఈఓ మదనేశ్వర్ రెడ్డి పిలుపు

**వేద న్యూస్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి:**

తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవమైన చిన్నచింతకుంట మండల పరిధిలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలోని సప్తగిరులపై వెలసిన శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం ఆవరణలో అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ మదనేశ్వర్ రెడ్డి తెలిపారు. 19వ తేదీ అమావాస్య రోజున దేవస్థానంలో అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. స్వామి దర్శనానికి వచ్చే ప్రతి ఒక్క భక్తుడు ఈ ఉచిత అన్నదాన కార్యక్రమంలో పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించాలని కోరారు. అన్నదాన కార్యక్రమం భక్తులకు సేవ చేయాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్నామని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దేవస్థానం అధికారులు విజ్ఞప్తి చేశారు.

## ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు ప్రారంభం



**వేద న్యూస్, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో పదో తరగతి వార్షిక పరీక్షలు శనివారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. బోయినిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు విలాసాగర్ ప్రభుత్వ పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలంలో మొదటి రోజు మొత్తం 223 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై 100 శాతం హాజరు నమోదు చేసినట్లు మండల విద్యాధికారి శ్రావణ్ కుమార్ తెలిపారు. విద్యార్థులను అరగంట ముందుగానే పరీక్షా కేంద్రానికి రప్పించి క్షుణ్ణంగా తనిఖీ చేసిన అనంతరం పరీక్షా హాలులోకి అనుమతించారు. పోలీసు ఉప పరిశీలకుడు రమాకాంత్ ఆధ్వర్యంలో పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని అధికారులు సూచించారు. పరీక్షా కేంద్రాల్లో వైద్య సిబ్బంది, తాగునీరు, సరైన వెలుతురు, ఫ్యాన్లు వంటి అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు.

## సారాపై జూపల్లి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం

### - మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య

**వేద న్యూస్, జడ్చర్ల:**

సారాను తెలంగాణ రాష్ట్రంలో మళ్లీ ప్రవేశపెట్టే అంశంపై మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని జడ్చర్ల మాజీ జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు కొడుగల్ యాదయ్య అన్నారు. జడ్చర్ల మున్సిపల్ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్ మరియు నిషేధ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సూచన మేరకు ఇప్పుడున్న సారాను తెలంగాణలో ప్రవేశపెట్టే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నదని, దీనిపై అసెంబ్లీలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలపై స్పందించిన కొడుగల్ యాదయ్య ఒక ప్రకటనలో మాట్లాడుతూ, గిరిజనుల అభివృద్ధి పేరుతో సారాను మళ్లీ తీసుకురావడం సరైన నిర్ణయం కాదని పేర్కొన్నారు. రాష్ట్రంలో సారా మళ్లీ ప్రారంభమైతే దళిత, గిరిజన కుటుంబాలపై తీవ్ర ప్రభావం పడుతుందని, వారి పిల్లలు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో సారా కారణంగా అనేక కుటుంబాలు విచ్ఛిన్నమయ్యాయని, భార్యాభర్తలు విడిపోయిన సంఘటనలు చోటుచేసుకు న్నాయని ఆయన గుర్తు చేశారు. గత ఇరవై సంవత్సరాలుగా రాష్ట్రంలో సారా లేక ప్రజలు ప్రశాంతంగా జీవిస్తున్నారని, మళ్లీ దాన్ని ప్రవేశపెడితే రాష్ట్రంలో భయంకరమైన పరిస్థితులు ఏర్పడే అవకాశముందని హెచ్చరించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సారాపై తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య కోరారు.



వేద న్యూస్

ఆదివారం మార్చి 15, 2026

# పేద కుటుంబానికి సొంతింటి కల సాకారం

**– సర్పంచ్ కాశిరెడ్డి భాస్కర్**

**వేద న్యూస్, ఇబ్రహీంపట్నం:**

ఇబ్రహీంపట్నం మండలం అమ్మక్కపేట్ గ్రామంలో మొదటి ఇందిరమ్మ ఇల్లు ప్రారంభ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాశిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం, గ్రామాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గృహహీన పేదలకు సొంత ఇల్లు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఎన్నో కుటుంబాల జీవితాల్లో కొత్త వెలుగులు నింపబడుతున్నాయని తెలిపారు. ప్రతి పేద కుటుంబం సొంత ఇల్లు కలను సాకారం చేసుకునేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని సూచించారు. గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలను మరింత



వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తామని సర్పంచ్ భాస్కర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లాపెల్లి దిలీప్ కుమార్, దర్శనం గంగాధర్, జిల్లాపెల్లి లక్ష్మణ్, జిల్లాపెల్లి ముత్తయ్య, జిల్లాపెల్లి భూమయ్య, చిట్యాల నర్సక్కతో పాటు గ్రామ పెద్దలు, మహిళా నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రమాదకరంగా మారనున్న ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

**– ఆందోళన వ్యక్తం చేస్తున్న స్థానికులు**

**వేద న్యూస్, జడ్చర్ల:**



జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు బాదేపల్లి ఈద్గా సమీపంలో ఇటీవల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు చేపట్టడం స్థానికుల్లో ఆందోళనకు గురి చేస్తోంది. ఈ ప్రదేశంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తే చిన్నారులకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు మహ్మద్ అజహర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రజలకు ఇబ్బంది కలగని మరో ప్రదేశానికి మార్చాలని ఆయన విద్యుత్ శాఖ అధికారులను కోరారు. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో జడ్చర్ల పట్టణంలోని సరస్వతి నగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయకపోవడంతో ఒక బాలుడు ప్రాణాలు కోల్పోయిన ఘటనను ఆయన గుర్తు చేశారు. ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాన్స్‌ఫార్మర్‌ను తగిన స్థలానికి మార్చాలని మహ్మద్ అజహర్ డిమాండ్ చేశారు.

# రంజాన్ మాసం ప్రేమ, సోదరభావానికి ప్రతీక

**– ముస్లింలందరూ భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకోవాలి**

**– ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి**

**వేద న్యూస్, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రతినిధి:**

వనపర్తి జిల్లా కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఇఫ్తార్ విందు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి శాసనసభ్యుడు తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తార్‌లో పాల్గొని రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేసి పలువురికి రంజాన్ తోఫాలను అందజేశారు. డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో ఐక్యతను పెంపొందించే పండుగగా రంజాన్‌కు ప్రత్యేక స్థానం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని, అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందేలా కృషి కొనసాగుతోందని తెలిపారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ ఉపవాసం ద్వారా ఆత్మ నియంత్రణ పెంపొందడమే కాకుండా పేదల పట్ల సానుభూతి భావం పెరుగుతుందని పేర్కొన్నారు. పరస్పర గౌరవం, సహకారంతో సమాజ అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడు



తూ రంజాన్ పండుగ శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. మైనారిటీల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, వనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముజహిద్, ముస్లిం మత పెద్దలు అఫ్జాలుద్దీన్, రహీం, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అనాథాశ్రమంలో జనసేన ఆవిర్భావ వేడుకలు



**వేద న్యూస్, కమలాపూర్:**

జనసేన పార్టీ స్థాపించి 12 సంవత్సరాలు పూర్తిచేసుకుని 13వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా హుజూరాబాద్ నియో జకవర్గ జనసేన పార్టీ నాయకులు జమ్మికుంట మండలం కొత్తపల్లిలోని స్పందన అనాథాశ్రమంలో పిల్లలతో కలిసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. అనంతరం అనాథాశ్రమంలోని పిల్లలకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ నాయకుడు పల్లె మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. సమాజ శ్రేయస్సు, ప్రజల అభివృద్ధి కోసం విప్లవాత్మక మార్పులు తీసుకురావాలనే లక్ష్యంతో జనసేన పార్టీని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్థాపించారని తెలిపారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా నిరంతరం ప్రజలకు సేవ చేస్తూ ముందుకు సాగుతున్నారని, ఆయన బాటలో తాము కూడా నడుస్తున్నామని పేర్కొన్నారు. సమాజంలో నిజమైన మార్పు రావాలంటే జనసేన పార్టీతోనే సాధ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ప్రవీణ్, మహేష్, అజయ్, సంతోష్, శివాజీ, శ్రీనివాస్, అయోధ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే రాందాస్ నాయక్ కి ఆహ్వానం

**వేద న్యూస్, కారేపల్లి:**



సింగరేణి మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఫుడ్ కోర్ట్' హోటల్ ప్రారంభోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయాల్సిందిగా కోరుతూ, వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ని శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో ఫుడ్ కోర్ట్ యజమాని ధరావత్ సుమంత్ నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మండల కేంద్రంలో ఆధునిక సౌకర్యాలతో వెలుస్తున్న ఫుడ్ కోర్ట్ స్థానికులకు నాణ్యమైన రుచులను అందించడమే కాకుండా, స్థానికంగా ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అజ్మీర హేమ్లా, అజ్మీర నరేన్, అజ్మీర రవి, హట్కర్ రాంబాబు, అజ్మీరా అంకుష్, అజ్మీరా బాబు,మరియు ఇతర ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు. నూతనంగా ప్రారంభం కానున్న ఈ ఫుడ్ కోర్ట్ సింగరేణి వాసులకు కొత్త రుచులను, ఉత్తమ వాతావరణాన్ని అందిస్తుందని, దీని ప్రారంభోత్సవం మండల ప్రజలకు పండుగ వాతావరణాన్ని తీసుకువస్తుందని స్థానికులు అభిప్రాయపడ్డారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**వేద న్యూస్, పాపన్నపేట :**



ద్విచక్ర వాహనాలు ఎదురుగా ఢీ కొన్న ఘటనలో గాయాల పాలై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని పాపన్నపేట గ్రామ శివారులో శనివారం చోటు చేసుకుంది.ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం...యూసుఫ్ పేట గ్రామానికి చెందిన తుడం నాని(22) అదే గ్రామానికి చెందిన అర్కెల చిన్నతో కలిసి బైక్ పై అరెకెల గ్రామానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా పాపన్నపేట గ్రామ శివారులోకి రాగానే ఎదురెదురుగా మరో బైక్ ఢీకొన్నాయి.దీంతో బైక్ వెనకాల కూర్చున్న నానికి తలకి తీవ్రగాయాలయ్యాయి.అటుగా వెళ్తున్న స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి అంబులెన్స్ లో తరలించగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# డొమెస్టిక్ సిలిండర్లు సీజ్..!

**– హోటళ్ళు, రెస్టారెంట్లపై డిసిఎస్ఓ ఆకస్మిక తనిఖీలు**



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి (డిసి ఎస్ఓ) శనివారం ఖమ్మం టౌన్‌లో పలు హోటళ్ళు, రెస్టారెంట్లపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గృహ అవసరాల కొరకు మాత్రమే ఉపయోగించవలసిన డొమెస్టిక్ ఎల్పిజి సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. తనిఖీల్లో మొత్తం 20 డొమెస్టిక్ ఎల్పిజి సిలిండర్లు స్వాధీనం చేసుకున్నారు. ఇది చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ఈ తనిఖీలలో అక్రమంగా వాడుతున్న మొత్తం 20 డొమెస్టిక్ ఎల్పిజి సిలిండర్లను సీజ్ చేసి అనంతరం సంబంధిత హోటల్ యజమానులపై కేసులు నమోదు చేశారు. భవిష్యత్తులో మరింత కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా డిసిఎస్ఓ మాట్లాడుతూ..డొమెస్టిక్ సిలిండర్లు ప్రభుత్వ సబ్సిడీపై సామాన్య గృహస్తుల కోసం మాత్రమే అందించబడతాయని, వాటిని వాణిజ్య అవసరాలకు దుర్వినియోగం చేయడం ఈసీ యాక్ట్ 1955, సెక్షన్ 6ఏ కింద శిక్షార్హమైన నేరమని హెచ్చరించారు. హోటళ్ళు, రెస్టారెంట్లు ఇతర వాణిజ్య సంస్థలు కేవలం కమర్షియల్ ఎల్పిజి సిలిండర్లు మాత్రమే వాడాలని, లేనిచో కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టంగా తెలిపారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని హెచ్చరించారు.

# పురుగుల మందు తాగి మహిళా మృతి..!

**వేద న్యూస్, పోతంగల్ :**

పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందిన ఘటన చోటు చేసుకున్నది. ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని హంగర్గ ఫారం గ్రామానికీ చెందిన కుంటన రమ (30) ఆమె భర్త మద్యానికి బానిసై ఎలాంటి పని చేయటం లేదని దీంతో కుటుంబ పోషణ భారం అవడంతో ఈ నెల 12 న సాయంత్రం గుర్తు తెలియని పురుగుల మందు తాగింది. ఆమెకు నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతి చెందిందని మృతురాలు తల్లి పిర్యాది మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఎస్సీ వర్గీకరణ ప్రకారం పార్టీలు రిజర్వేషన్ కల్పించాలి

**– బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు**

**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

ఎస్సీ వర్గీకరణ ప్రకారం రాజకీయ పార్టీలు రిజర్వేషన్ కల్పించి రాబోయే ఎంపిటిసీ, జడ్పిటసీ ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు సమన్యాయం పాటిస్తూ రిజర్వేషన్లు కేటాయించాలని బహుజన సమాజ్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు కోరారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో బాబురావు మాట్లాడుతూ... ఎంపిటిసీ, జడ్పిటీసీ ఎన్ని కల్లో రిజర్వేషన్ ప్రకారం ఎస్సీ ఉపకులాలతోపాటు మహిళలకు కూడా 33శాతం రిజర్వేషన్ కల్పించినప్పుడే అన్ని వర్గాల ప్రజలకు సమాన రాజకీయ అవకాశం దక్కినట్టు అవుతుందని అన్నారు.



# పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన తహసిల్దార్

**వేద న్యూస్, పోతంగల్ :**




పోతంగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన 10వ తరగతి పరీక్ష కేంద్రాన్ని శనివారం తహసీల్దార్ రంజిత్ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థుల కు ఏర్పాటు చేసిన వసతుల్లో ఎలాంటి సమస్యలు ఉండ కూడదని సిబ్బందికి సూచించారు. పారదర్శకంగా పరీక్షలు నిర్వహిం చాలని అన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణం లో విద్యార్థులు పరీక్షలు రాసే విధంగా చూడాలని అన్నారు. ఆయన వెంట ఎంఈఓ శంకర్, తదితరులు ఉన్నారు.

వేద న్యూస్

ఆదివారం మార్చి 15, 2026

## డా.గుగ్గిళ్ళ దివ్యమూర్తికి ఉపాధ్యాయరత్న జాతీయ అవార్డు



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కొత్తకొత్తూరు గ్రామానికి చెందిన అపరమేధావి డా. గుగ్గిళ్ళ దివ్య మూర్తికి ఉపాధ్యాయ రత్న జాతీయ అవార్డు లభించి ంది. ఈ అవార్డును గుగ్గిళ్ళ దివ్యమూర్తి హైదరాబాదులోని హిమాయత్ నగర్ లో సుప్రీంకోర్టు అడ్వకేట్ ఈడా శేషగిరిరావు చేతుల మీదుగా అందుకోవడం జరిగింది. ఈ అవార్డును గుగ్గిళ్ళ దివ్యమూర్తికి సావిత్రి బాయి పూలే మెమోరియల్ ఆర్గనైజేషన్ వారు ప్రకటించారు. గుగ్గిళ్ళ దివ్యమూర్తి అనేకచోట్ల విద్యార్థులకు మోటివేషనల్ క్లాసులు చెబుతున్నందుకు ఈ అవార్డు ఇస్తున్నట్లు సంస్థ సభ్యులు తెలియజేశారు. అనంతరం గుగ్గిళ్ళ దివ్యమూర్తిని ఈడా శేషగిరిరావు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ అవార్డు రావడం తనకు సంతోషంగా ఉందని గుగ్గిళ్ళ దివ్యమూర్తి తెలియజేశారు. ఇప్పటి వరకు తనకు 69 వార్డులు వచ్చాయని, 125 చోట్ల సన్మానం జరిగిందని గుగ్గిళ్ళ దివ్యమూర్తి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త బూర సైదారావు గౌడ్, పెనుబల్లి మండలం తుమ్మలపల్లి సర్పంచ్ బుడ్డయ్య, కుక్కల నాగయ్య గౌడ్, శరత్ గౌడ్, తల్లాడ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు

## అంతర్జాతీయ పార్లమెంటరీ గ్రూప్‌లో ఖమ్మం ఎంపీకి చోటు

**– భారత్‌స్విట్జర్లాండ్ పార్లమెంటరీ ఫ్రెండ్షిప్ గ్రూప్ సభ్యుడిగా రఘురాం రెడ్డి**



**వేద న్యూస్, ఖమ్మం ప్రతినిధి :**

ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డికి అంతర్జాతీయ పార్లమెంటరీ స్థాయిలో కీలక బాధ్యత దక్కింది. భారత్‌స్విట్జర్లాండ్ పార్లమెంటరీ ఫ్రెండ్షిప్ గ్రూప్ సభ్యుడిగా ఆయనను లోక్‌సభ స్పీకర్ నామినేట్ చేశారు. ప్రస్తుత 18వ లోక్‌సభ కాలానికి సంబంధించి భారత్, స్విట్జర్లాండ్ దేశాల మధ్య పార్లమెంటరీ స్నేహ సంబంధాలను బలోపేతం చేసే లక్ష్యంతో ఈ ఫ్రెండ్షిప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసినట్లు లోక్‌సభ సెక్రటేరియట్ వెల్లడించింది. ఈ మేరకు లోక్‌సభ సెక్రటేరియట్ కాన్ఫరెన్స్ నుంచి ఎంపీ రఘురాం రెడ్డికి అధికారికంగా సమాచారం పంపించారు. ఈ గ్రూప్ ద్వారా రెండు దేశాల పార్లమెంటరీ సభ్యుల మధ్య పరస్పర సహకారం, ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.

**కీలక బాధ్యత పట్ల పలువురి హర్షం**

ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రఘురాం రెడ్డికి ఈ అంతర్జాతీయ పార్లమెంటరీ గ్రూప్‌లో సభ్యత్వం లభించడం పట్ల ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## ‘జెఫింగ్’ ట్రెండ్: పరుగు మధ్యలో నడకతో ఫిట్‌నెస్‌కు కొత్త దారి





**- ఊపిరి తేలికగా స్టామినా ఎక్కువగా - గాయాల ముప్పు తగ్గించే రన్‌వాక్ పద్ధతి**

**వేద న్యూస్ డెస్క్:**

కొద్దిదూరం పరుగెత్తగానే ఊపిరి అందకపోవడం, కండరాల నొప్పులు రావడం చాలా మందికి సహజమే. ఈ సమస్యలకు పరిష్కారంగా ఇప్పుడు ‘జెఫింగ్’ అనే సరికొత్త ఫిట్‌నెస్ విధానం ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతోంది. ఇది పరుగు మధ్యలో నియంత్రిత నడకను కలిపిన శిక్షణ పద్ధతి. దీని వల్ల స్టామినా పెరిగి, అలసట తగ్గి, గాయాల ప్రమాదం తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ పద్ధతిని ఒలింపిక్ స్థాయి రన్నర్ జెఫ్ గాలోవే ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారు. నిర్ణీత సమయం పరుగెత్తి, ఆ తర్వాత కొద్దిసేపు చురుకుగా నడిచి మళ్లీ పరుగు మొదలుపెట్టడం ఈ విధానంలోని ముఖ్యాంశం. పరుగు మొదలుపెట్టిన వెంటనే ఇంటర్వెల్స్ పాటించడం వల్ల శరీరం అధిక ఒత్తిడికి గురికాకుండా క్రమంగా దూరం పెంచుకోవచ్చు. కొత్తగా ప్రారంభించే వారు 30 సెకన్లు పరుగు, 30 సెకన్లు నడకతో మొదలుపెట్టవచ్చు. మధ్యస్థ స్థాయి వారు మూడు నిమిషాల పరుగు తర్వాత ఒక నిమిషం నడకను అనుసరించవచ్చు. నడిచేటప్పుడు పూర్తిగా ఆగిపోకుండా, గుండె వేగం తగ్గకుండా చురుకుగా నడవడం అవసరం. స్నేహితులతో మాట్లాడగలిగేంత వేగంతోనే పరుగు కొనసాగించాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఈ పద్ధతి వల్ల కీళ్లు, కండరాలపై ఒత్తిడి తగ్గి, వ్యాయామం తర్వాత వచ్చే నొప్పులు తక్కువగా ఉంటాయి. కేలరీలు సమర్థవంతంగా దహనం అవడంతో బరువు తగ్గడంలో కూడా సహాయపడుతుంది. అనుభవజ్ఞులైన రన్నర్లు సైతం దీని ద్వారా సుదూర రేసులను వేగంగా పూర్తి చేస్తున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. పరుగును భారంగా కాకుండా ఆనందంగా మార్చుకోవడానికి జెఫింగ్ మంచి మార్గమని నిపుణులు అంటున్నారు. ఆరోగ్యంగా ఉండటానికి కేవలం కష్టపడటమే కాదు, తెలివిగా వ్యాయామం చేయడం కూడా ముఖ్యమని ఈ పద్ధతి స్పష్టం చేస్తోంది.

## కంటి నొప్పి: నిర్లక్ష్యం చేస్తే ప్రమాదమే



**- కంటిదా? మెదడుదా? లక్షణాలు గుర్తించడం ముఖ్యం**

**వేద న్యూస్ డెస్క్:**

కంటి నొప్పి సాధారణంగా అలసట, ఇన్ఫెక్షన్లు, గాయాలు లేదా ఎక్కువసేపు మొబైల్, టీవీ వాడకం వల్ల వస్తుంది. అయితే ఈ నొప్పి కంటికి సంబంధించినదా లేక మెదడుకు సంబంధించినదా అన్నది గుర్తించడం చాలా ముఖ్యం. చాలా మంది దీనిని సాధారణ తలనొప్పిగా భావించి నిర్లక్ష్యం చేస్తారు. కానీ కొన్ని సందర్భాల్లో ఇది తీవ్రమైన సమస్యకు సంకేతం కావచ్చు. ఆరోగ్య నిపుణుల ప్రకారం కంటి నొప్పి ఒక్కటే ఉంటే అది మెదడు సమస్య కావడం చాలా అరుదు. కానీ కంటి నొప్పితో పాటు నుదిటి నుంచి మెడ వరకు తీవ్రమైన తలనొప్పి, తరచూ తల తిరగడం, శరీరంలోని ఏదైనా భాగంలో తిమ్మిరి, పదేపదే వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఇవి మెదడులో వాపు, కణితి వంటి సమస్యలకు సంకేతాలు కావచ్చు. కంటి నొప్పిని నివారించడానికి కొన్ని సాధారణ జాగ్రత్తలు పాటించాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి కంటి పరీక్ష చేయించుకోవడం మంచిది. మొబైల్ ఫోన్, టీవీ వాడకాన్ని పరిమితం చేయాలి. అవసరమైతే సరైన పవర్ ఉన్న కంటి అద్దాలు వాడాలి. విటమిన్ ఏ, సి, ఈ వంటి పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలి. కళ్లకు తగినంత విశ్రాంతి ఇవ్వడం చాలా ముఖ్యం. కంటి నొప్పి చిన్న సమస్యగా కనిపించినా,

## మెంతులు ఆరోగ్యానికి సహజ వరం

**– నానబెట్టిన మెంతులతో శరీరానికి శక్తి – గుండె నుంచి హార్మోన్ల వరకు రక్షణ కవచం**

**వేద న్యూస్ డెస్క్:**

మన వంటింట్లో సాధారణంగా పోపు దినుసుగా ఉపయోగించే మెంతులను కేవలం రుచికోసం మాత్రమే కాకుండా ఒక సూపర్ ఆహారంగా పరిగణించాల్సిన అవసరం ఉంది. మెంతుల్లో శరీరానికి అవసరమైన పీచు పదార్థం, ఇనుము, కాల్షియం, మెగ్నీషియం, విటమిన్ బి6తో పాటు శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి సమగ్ర ఆరోగ్యాన్ని అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. రాత్రంతా మెంతి గింజలను నీటిలో నానబెట్టి, ఉదయం ఖాళీ కడుపుతో ఆ నీటిని తాగి గింజలను నమలడం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. శాస్త్రీయ అధ్యయనాల ప్రకారం మెంతుల్లోని సాపోనిన్లు, ఫినోలిక్ సమ్మేళనాలు శరీరంలోని వాపును తగ్గించడంలో



సహాయపడతాయి. ఈ విధంగా తీసుకోవడం వల్ల పోషకాలు నేరుగా రక్తంలోకి చేరి శరీరానికి త్వరిత ప్రయోజనం అందిస్తాయి. మెంతులు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్‌ను పెంచడంలో సహాయపడతాయి. దీంతో ధమనులలో అడ్డంకులు తగ్గి గుండె ఆరోగ్యంగా ఉంటుంది. అలాగే మెంతి నీరు గ్యాస్, ఎసిడిటీ, మలబద్ధకం వంటి జీర్ణ సంబంధ సమస్యలను తగ్గిస్తుంది. ప్రేగులను శుభ్రంగా ఉంచి శరీరానికి తేలికను కలిగిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో మెంతులు అద్భుతంగా పనిచేస్తాయి. జీవక్రియను వేగవంతం చేసి ఆకలిని తగ్గించి శరీరంలోని అదనపు కొవ్వును కరిగించడంలో సహాయపడతాయి. మహిళల ఆరోగ్యానికి మెంతులు ప్రత్యేకంగా మేలు చేస్తాయి. హార్మోన్ల సమతుల్యతను కాపాడి క్రమరహిత రుతుక్రమం, థైరాయిడ్, పీసీఓడీ వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఈస్ట్రోజెన్ స్థాయిలను సమతుల్యం చేయడం ద్వారా చర్మం యవ్వనంగా ఉండటానికి, జుట్టు బలంగా పెరగడానికి తోడ్పడతాయి. అయితే ఏ ఆహారాన్నైనా మితంగా తీసుకోవడం ముఖ్యం. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు వైద్యుల సలహాతో మెంతులను ఆహారంలో చేర్చుకోవడం ఉత్తమం.

## శాకాహారులకు ప్రొటీన్ ఆందోళన అవసరమా?




**వేద న్యూస్ డెస్క్:**

ఆరోగ్యం : ప్రొటీన్ విషయంలో శాకాహారులు చాలాసార్లు ఆందోళన చెందుతుంటారు. తగినంత ప్రొటీన్ అందడం లేదేమోనని భావించి ప్రొటీన్ పొడులు వాడాలా అనే సందేహం కలుగుతుంది. అయితే నిపుణుల ప్రకారం, ఆహారం ద్వారానే ప్రొటీన్ పొందడం ఉత్తమ మార్గం. సాధారణంగా ప్రతి కిలో శరీర బరువుకు రోజుకు 0.8 గ్రాముల ప్రొటీన్ అవసరం. 50 ఏళ్లు దాటినవారికి ఈ మోతాదు 1.2 గ్రాముల వరకు ఉండాలి. జంతు ఆధారిత ఆహారాల్లో తొమ్మిది అత్యవసర అమైనో ఆమ్లాలు సమృద్ధిగా ఉంటాయి. వీటిని శరీరం సులభంగా గ్రహిస్తుంది. సోయాబీన్స్ మినహా చాలా శాకాహార పదార్థాల్లో ఒకటి లేదా రెండు అమైనో ఆమ్లాలు మాత్రమే ఉంటాయి. అయితే నిరాశ చెందాల్సిన అవసరం లేదు. సరైన ఆహార కలయికలతో పూర్తి అమైనో ఆమ్లాలను పొందవచ్చు. ఉదాహరణకు బియ్యం, గోధుమల వంటి తృణధాన్యాల్లో లైసిన్ తక్కువగా ఉంటుంది. పప్పుదినుసుల్లో మిథియోనిన్ కొరవడుతుంది. కాబట్టి మూడు వంతులు తృణధాన్యాలు, ఒక వంతు పప్పులు కలిపి తీసుకుంటే ఈ లోపాలు భర్తీ అవుతాయి. బియ్యంలో లేని లైసిన్ పప్పుల ద్వారా లభిస్తుంది. పప్పుల్లో లేని మిథియోనిన్ తృణధాన్యాల నుంచి అందుతుంది. ఈ విధంగా అన్ని అత్యవసర అమైనో ఆమ్లాలు శరీరానికి చేరి ప్రొటీన్ సమృద్ధిగా లభిస్తుంది. మితిమీరిన ప్రొటీన్ పొడుల వినియోగం దీర్ఘకాలంలో దుష్ప్రభావాలకు దారితీయొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అధిక మోతాదులో ప్రొటీన్ తీసుకుంటే కిడ్నీలపై భారం పడుతుంది. ప్రొటీన్ జీర్ణమయ్యాక మిగిలే

## నిద్రతోనే రోగనిరోధక శక్తి బలోపేతం

**- సైటోకైన్లు పెరగాలంటే గాఢ నిద్ర అవసరం - టి-కణాల చురుకుదనానికి విశ్రాంతి కీలకం**

**వేద న్యూస్ డెస్క్:**

ఆరోగ్యకరమైన జీవనానికి నిద్ర ఎంతో ముఖ్యమని వైద్యులు చెబుతున్నారు. ముఖ్యంగా రోగనిరోధక శక్తి బలంగా ఉండాలంటే కంటి నిండా నిద్ర తప్పనిసరి. శరీరంలో సైటోకైన్లు అనే ప్రోటీన్లు వార్తాహరుల్లా పనిచేస్తూ రోగనిరోధక ప్రతిస్పందనను నియంత్రిస్తాయి. ఇంటర్ల్యూకిన్-1, ట్యూమర్ నెక్రోసిస్ ఫ్యాక్టర్ వంటి కొన్ని సైటోకైన్ల స్థాయిలు నిద్ర సమయంలో పెరుగుతాయి. ఇవి వాపు ప్రక్రియను నియంత్రించడంలో, ఇన్ఫెక్షన్లతో పోరాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. నిద్రలేమి ఉంటే వీటి ఉత్పత్తి తగ్గిపోవడంతో రోగనిరోధక వ్యవస్థ బలహీనపడే ప్రమాదం ఉంది. తెల్ల రక్తకణాల్లో ముఖ్యమైనవి టి-కణాలు. ఇవి శరీరాన్ని దాడి చేసే వైరస్లు, బ్యాక్టీరియాలను గుర్తించి వాటిని నిర్మూలించడంలో ప్రధాన పాత్ర పోషిస్తాయి. పరిశోధనల ప్రకారం, గాఢ నిద్ర టి-కణాల చురుకుదనాన్ని పెంచుతుంది. ఇన్ఫెక్షన్‌కు గురైన కణాలను వేగంగా గుర్తించి స్పందించే సామర్థ్యం నిద్రతో మెరుగుపడుతుంది. నిద్రలేమి కారణంగా ఈ ప్రతిస్పందన మందగించి జబ్బులు త్వరగా సోకే అవకాశం ఉంటుంది.

అలాగే యాంటీబాడీలు శరీరాన్ని రోగకారక క్రిముల నుంచి రక్షించే ఆయుధాల్లాంటివి. వీటి సరైన ఉత్పత్తికి కూడా నిద్ర అవసరం. సరిపడా నిద్రపోతే శరీరం భవిష్యత్తులో వచ్చే ఇన్ఫెక్షన్లను ఎదుర్కొనేలా సిద్ధంగా ఉంటుంది. అందుకే రాత్రిళ్లు అర్ధరాత్రి వరకు టీవీ, మొబైల్ వినియోగం తగ్గించి త్వరగా నిద్రపోవడం మంచిది. పెద్దవారికి రోజుకు సాధారణంగా 7 నుంచి 9 గంటల నిద్ర అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. అయితే అతిగా 9-10 గంటలకు మించి నిద్రపోవడం కూడా ఆరోగ్యకరం కాదు. ఎక్కువసేపు పడుకున్నప్పటికీ అలసటగా అనిపిస్తే గాఢనిద్ర లోపించిందనే సూచన

వేద న్యూస్

ఆదివారం మార్చి 15, 2026

## విజయ్ దేవరకొండ పాత ట్వీట్ వైరల్




**వేద న్యూస్ డెస్క్:**

టాలీవుడ్ సెన్సేషనల్ జంటగా భావిస్తున్న విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న గురించి ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. వీరిద్దరి వివాహంపై వస్తున్న వార్తలు వైరల్ అవుతున్న నేపథ్యంలో ఎనిమిదేళ్ల క్రితం విజయ్ దేవరకొండ చేసిన ఒక పాత ట్వీట్ ఇప్పుడు మరోసారి నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. అప్పట్లో సరదాగా చేసిన ఆ వ్యాఖ్య ఇప్పుడు నిజం కావొచ్చని అభిమానులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న కలిసి నటించిన చిత్రం 'గీత గోవిందం'. ఆ సినిమా చిత్రీకరణ సమయంలోనే వీరిద్దరి మధ్య మంచి స్నేహం ఏర్పడిందని అప్పటినుంచే వార్తలు వినిపిస్తున్నాయి. అప్పటి నుంచి వారి మధ్య ఉన్న అనుబంధంపై తరచూ చర్చలు జరుగుతూనే ఉన్నాయి.


2018 జూన్ 23న 'గీత గోవిందం' సినిమా ప్రచార కార్యక్రమాల సందర్భంగా విజయ్ దేవరకొండ ఒక ట్వీట్ చేశారు. సినిమాలో రష్మికను భుజాన ఎత్తుకుని నడిచే సన్నివేశాన్ని ఉద్దేశిస్తూ "నా కాళ్లు తిమ్మిరి ఎక్కినా, నడుము నొప్పి వచ్చినా మీ బరువు బాధ్యత ఎప్పుడూ నాదే మేడమ్" అని రాసుకొచ్చారు. అప్పట్లో ఈ ట్వీట్‌ను కేవలం సినిమా ప్రచారంలో భాగంగా చేసిన సరదా వ్యాఖ్యగా భావించారు.

అయితే ప్రస్తుతం వీరిద్దరి వివాహంపై వస్తున్న వార్తల నేపథ్యంలో ఆ పాత ట్వీట్‌ను నెటిజన్లు మళ్లీ వెలికితీసి పంచుకుంటున్నారు. "అప్పుడే మాట ఇచ్చేశావా విజయ్?" అంటూ సరదాగా వ్యాఖ్యలు చేస్తున్నారు. దీంతో ఆ ట్వీట్ మళ్లీ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

ఇటీవల విజయ్ దేవరకొండ తన స్వగ్రామంలో సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించడం, గ్రామస్తులకు అన్నదానం చేయడం వంటి ఫోటోలు కూడా వైరల్ అయ్యాయి. ఆ తర్వాత వీరిద్దరి వివాహంపై ఊహాగానాలు మరింత పెరిగాయి. 'అర్జున్ రెడ్డి' చిత్రంతో స్టార్ హీరోగా ఎదిగిన విజయ్ దేవరకొండ, 'నేషనల్ క్రష్'గా గుర్తింపు పొందిన రష్మిక మందన్న కలిసి నటించినప్పుడు తెరపై చూపించిన కెమిస్ట్రీ అభిమానులను ఆకట్టుకుంది. అదే అనుబంధం నిజ జీవితంలో కూడా ఉందని వారి సన్నిహితులు చెబుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే అప్పట్లో సరదాగా చేసిన ట్వీట్ ఇప్పుడు అభిమానుల దృష్టిలో ఒక అందమైన ప్రేమకథకు సూచనగా మారిందని నెటిజన్లు వ్యాఖ్యానిస్తున్నారు.

## ఆ సినిమా ఫలితం ముందే తెలిసింది.. రాశీ ఖన్నా వ్యాఖ్యలు వైరల్

**వేద న్యూస్ డెస్క్:**



టాలీవుడ్ నటి రాశీ ఖన్నా తాజాగా చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న ఆమె తన గత చిత్రం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒక సినిమా ఫలితం ఎలా ఉండబోతుందో తనకు చిత్రీకరణ సమయంలోనే అర్థమైపోయిందని చెప్పడం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. 'ఊహలు గుసగుసలాడే' చిత్రంతో తెలుగు సినీ రంగంలోకి అడుగుపెట్టిన రాశీ ఖన్నా తొలి సినిమాతోనే మంచి గుర్తింపు సంపాదించారు. అనంతరం 'జోరు', 'సుప్రీం', 'జై లవకుశ', 'తొలి ప్రేమ', 'వెంకీమామ', 'ప్రతి రోజు పండగే' వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. తెలుగు చిత్రాలతో పాటు హిందీ, తమిళ భాషల్లో కూడా ఆమె నటించారు. ఇటీవల ఆమె నటించిన 'తెలుసు కదా' చిత్రంపై మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఆ సినిమా చిత్రీకరణ జరుగుతున్నప్పుడే ఫలితం ఎలా ఉండబోతుందో నాకు అర్థమైంది. కొన్ని సన్నివేశాలు చిత్రీకరిస్తున్నప్పుడు అవి సరైన విధంగా అనిపించలేదని నేను చెప్పాను. కొన్ని అంశాలపై నా అభిప్రాయం వెల్లడించినప్పటికీ దర్శకుడి ఆలోచనపై నమ్మకం ఉంచి ముందుకు వెళ్లాం" అని ఆమె తెలిపారు. క్లైమాక్స్ సన్నివేశం కూడా అందరికీ నచ్చేలా ఉండాలని తాను భావించానని, అయితే కథలో కొన్ని మార్పులు చోటుచేసుకున్నాయని చెప్పారు. సినిమా చిత్రీకరణ జరుగుతున్న కొద్దీ కథలో మార్పులు జరిగాయని, ఆ సమయంలో తన చేతుల్లో పెద్దగా ఏమీ లేకపోయిందని ఆమె వెల్లడించారు. ఈ సినిమా ద్వారా తాను కూడా ఒక పాఠం నేర్చుకున్నానని, భవిష్యత్తులో తన అభిప్రాయాన్ని మరింత బలంగా చెప్పాల్సిన అవసరం ఉందని అర్థమైందని పేర్కొన్నారు. కాగా 'తెలుసు కదా' చిత్రంలో సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించగా, శ్రీనిధి శెట్టి మరో కథానాయికగా కనిపించారు. ప్రస్తుతం రాశీ ఖన్నా పవన్ కళ్యాణ్ సరసన నటించిన 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం ఉగాది కానుకగా మార్చి 19న విడుదలకు సిద్ధమవుతోంది.

## 'ఆయా షేర్' పాట కోసం భారీ సెట్స్‌డ రెండున్నర ఎకరాల్లో స్లమ్ సామ్రాజ్యం

**వేద న్యూస్ డెస్క్:**



నేచురల్ స్టార్ నాని నటిస్తున్న తాజా పాన్ ఇండియా చిత్రం 'ది ప్యారడైజ్' నుంచి ఇటీవల విడుదలైన 'ఆయా షేర్' పాట సామాజిక మాధ్యమాల్లో విశేష స్పందన అందుకుంటోంది. ఈ పాటకు యూట్యూబ్‌లో మిలియన్ల వ్యూస్ రావడంతో పాటు వేలాది రీల్స్ రూపంలో కూడా విస్తృతంగా వైరల్ అవుతోంది. ఈ పాటలో హీరోను స్లమ్ సామ్రాట్‌గా చూపించేందుకు చిత్రబృందం భారీ స్థాయిలో ప్రత్యేక సెట్స్ నిర్మించడం ప్రధాన ఆకర్షణగా మారింది. 'ఆయా షేర్' పాట చిత్రీకరణ కోసం దాదాపు రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యేకంగా స్లమ్ సెట్స్ రూపొందించారు. ఇందులో హీరో నివాసం కోసం కమాన్ శైలిలో ఒక పెద్ద ఇల్లు నిర్మించారు. ఈ నిర్మాణం సుమారు అరవై అడుగుల వెడల్పు, నలభై ఐదు అడుగుల ఎత్తు, ఇరవై ఐదు అడుగుల లోతుతో రూపొందించబడింది. ఈ సెట్ నిర్మాణానికి సుమారు ఇరవై ఐదు మంది కార్మికులు ఇరవై రోజుల పాటు శ్రమించినట్లు చిత్రబృందం తెలిపింది. ఈ పాటలో కనిపించే మరో ప్రధాన ఆకర్షణ నీటి వనరుతో కూడిన గ్రామ వాతావరణం. దీనిని కూడా రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యేకంగా రూపొందించారు. ఇందులో డమ్మీ నిర్మాణాలకన్నా నిజమైన ఇళ్లలా కనిపించేలా సుమారు అరవై ఇళ్లు నిర్మించారు. గ్రామ వాతావరణాన్ని సహజంగా చూపించేందుకు యాభై మంది కార్మికులు దాదాపు ముప్పై రోజుల పాటు పనిచేశారు. మొత్తం మీద ఐదు వందల మంది నివసించే గ్రామంలా కనిపించేలా ఈ సెట్స్ రూపొందించారు. గ్రామం మధ్యలో నీటి వనరు కోసం వంద ట్యాంకర్ల నీటిని తీసుకొచ్చి వారం రోజుల పాటు నింపారు. అదనంగా సహజత్వం కోసం మరో చిన్న చెరువును కూడా తవ్వారు.

## రోజర్ బిన్నీ, రాహుల్ ద్రావిడ్, మిథాలీ రాజ్‌కు జీవిత సాఫల్య పురస్కారం

**వేద న్యూస్ డెస్క్:**




భారత క్రికెట్ నియంత్రణ మండలి నిర్వహించే నమన్ అవార్డు ప్రదానోత్సవంలో ప్రముఖ మాజీ క్రికెటర్లు రోజర్ బిన్నీ, రాహుల్ ద్రావిడ్, మిథాలీ రాజ్‌లను జీవిత సాఫల్య పురస్కారాలతో సత్కరించనున్నారు. ఢిల్లీలో ఆదివారం జరగనున్న ఈ కార్యక్రమంలో ఇటీవలి కాలంలో అంతర్జాతీయ క్రికెట్ మండలి టోర్నీల్లో విజయం సాధించిన భారత జట్లను కూడా ఘనంగా సన్మానించనున్నారు. ఇటీవల ముగిసిన ఇరవై ఓవర్ల ప్రపంచ కప్‌లో విజయం సాధించిన సూర్యకుమార్ నేతృత్వంలోని భారత జట్టుకు ప్రత్యేక సన్మానం చేయనున్నారు. అలాగే 2025లో మహిళల వన్డే ప్రపంచ కప్ గెలిచిన భారత మహిళల జట్టు, ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ గెలిచిన పురుషుల జట్టు, 2026లో అండర్19 ప్రపంచ కప్ గెలిచిన జట్టు, 2025 మహిళల అండర్19 ప్రపంచ కప్ జట్లను కూడా ఈ సందర్భంగా గౌరవించనున్నారు. మాజీ క్రికెటర్లు రోజర్ బిన్నీ, రాహుల్ ద్రావిడ్‌లకు కల్నల్ సీకే నాయుడు జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేయనున్నారు. మాజీ మహిళల కెప్టెన్ మిథాలీ రాజ్‌కు భారత క్రికెట్ నియంత్రణ మండలి జీవిత సాఫల్య పురస్కారం అందజేయనున్నారు. 1983 వన్డే ప్రపంచ కప్ గెలిచిన భారత జట్టులో రోజర్ బిన్నీ కీలక సభ్యుడిగా ఉన్నారు. ఆ టోర్నీలో అత్యధిక వికెట్లు సాధించి ప్రత్యేక గుర్తింపు పొందారు. తరువాత కోచ్, సెలెక్టరు, భారత క్రికెట్ నియంత్రణ మండలి అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. రాహుల్ ద్రావిడ్ అంతర్జాతీయ క్రికెట్‌లో ఇరవై నాలుగు వేలకుపైగా పరుగులు సాధించిన గొప్ప బ్యాటర్‌గా గుర్తింపు పొందారు. 2024లో భారత జట్టు ఇరవై ఓవర్ల ప్రపంచ కప్ గెలిచిన సమయంలో జట్టు ప్రధాన కోచ్‌గా సేవలందించారు. ఈ కార్యక్రమంలో పలువురు క్రికెటర్లకు వ్యక్తిగత అవార్డులు కూడా ప్రదానం చేయనున్నారు. పురుషుల విభాగంలో ఉత్తమ అంతర్జాతీయ క్రికెటర్‌గా శుభ్‌మన్ గిల్‌కు పాలీ ఉమ్రిగర్ అవార్డు ఇవ్వనున్నారు. మహిళల విభాగంలో ఉత్తమ అంతర్జాతీయ క్రికెటర్‌గా స్మృతి మంధానా ఎంపికయ్యారు. మహిళల దేశీయ క్రికెట్‌లో ఉత్తమ ఆటగాడిగా ఇరా జాదవ్‌కు జగన్మోహన్ దాల్మియా అవార్డు ప్రదానం చేయనున్నారు. సీనియర్ మహిళల దేశీయ వన్డే విభాగంలో ఉత్తమ క్రికెటర్‌గా షఫాలి వర్మ ఎంపికయ్యారు. ఉత్తమ ఆల్‌రౌండర్‌గా అయుష్ మాత్రేకు లాల్ అమర్‌నాథ్ అవార్డు ఇవ్వనుండగా, రంజీ ట్రోఫీలో ఉత్తమ ఆల్‌రౌండర్‌గా విదర్భ ఆటగాడు హర్ష్ దూబే ఎంపికయ్యారు.

## బ్యాడ్మింటన్ స్కోరింగ్ మార్పులకు సైనా నెహ్వాల్ వ్యతిరేకం

**వేద న్యూస్ డెస్క్:**



భారత మాజీ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ బ్యాడ్మింటన్ ఆటలో స్కోరింగ్ విధానాన్ని మార్చే ప్రతిపాదనలను తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రస్తుతం అమలులో ఉన్న 21 పాయింట్ల విధానాన్ని కొనసాగించాల్సిందేనని ఆమె అభిప్రాయపడ్డారు. స్కోరింగ్‌ను 15 పాయింట్లకు తగ్గించాలనే ఆలోచనను వెంటనే విరమించుకోవాలని ఆమె కోరారు. బ్యాడ్మింటన్ ఆటలో మార్పులు చేయాలనే ఉద్దేశంతో ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య 3 సెట్‌లు, ప్రతి సెట్‌కు 15 పాయింట్ల స్కోరింగ్ విధానాన్ని ప్రవేశపెట్టే అంశంపై చర్చలు జరపనుంది. ఈ ప్రతిపాదనపై డెన్మార్క్‌లోని హోర్సెన్స్ నగరంలో ఏప్రిల్ 25న జరగనున్న వార్షిక సమావేశంలో ఓటింగ్ నిర్వహించనున్నారు. అయితే పాత విధానమే ఆటకు మేలు చేస్తుందని పలువురు మాజీ ఆటగాళ్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై స్పందించిన సైనా నెహ్వాల్ బ్యాడ్మింటన్ ఆటకు గొప్ప చరిత్ర ఉందని తెలిపారు. ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్, ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్స్ వంటి ప్రముఖ టోర్నీలలో ఆటగాళ్లు తీవ్ర పోటీతో పాటు ఓర్పు, పట్టుదల ప్రదర్శించాల్సి ఉంటుందని చెప్పారు. అందువల్ల స్కోరింగ్ విధానంలో మార్పులు చేసే విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. ప్రస్తుతం అమలులో ఉన్న 21 పాయింట్ల విధానానికి ఆటగాళ్లు ఇప్పటికే అలవాటు పడ్డారని ఆమె తెలిపారు. ఒకవేళ స్కోరింగ్‌ను 15 పాయింట్లకు తగ్గిస్తే మ్యాచ్‌లలో ర్యాలీల స్వభావం, పోటీతత్వ సమతుల్యం దెబ్బతినే అవకాశముందని పేర్కొన్నారు. క్రీడాకారులు పోటీలపై దృష్టి పెట్టేలా, ఆట స్ఫూర్తి కొనసాగించేలా నిర్ణయాలు తీసుకోవాలని ఆమె సూచించారు. క్రీడలో మార్పులు చేయడం కంటే ఆటగాళ్ల సంక్షేమం, వారి అభివృద్ధిపై దృష్టి పెట్టాలని కూడా ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్యను సైనా నెహ్వాల్ కోరారు.

## అంతర్జాతీయ క్రికెట్‌లో అయిదేళ్లు పూర్తి చేసిన సూర్యకుమార్

**వేద న్యూస్ డెస్క్:**




భారత క్రికెట్ జట్టు స్టార్ బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ అంతర్జాతీయ క్రికెట్‌లో అడుగుపెట్టి అయిదేళ్లు పూర్తయిన సందర్భంగా భావోద్వేగ సందేశం పంచుకున్నారు. ఈ సందర్భంగా తన క్రికెట్ ప్రయాణానికి సంబంధించిన జ్ఞాపకాలతో ఒక వీడియోను సామాజిక మాధ్యమంలో అభిమానులతో పంచుకున్నారు. భారత జెర్సీ ధరించడం తన జీవితంలో అత్యంత గర్వకారణమని, ఆ అనుభూతిని మాటల్లో చెప్పడం సాధ్యం కాదని సూర్యకుమార్ తెలిపారు. అయిదేళ్ల క్రితం ప్రారంభమైన ఈ ప్రయాణం ఒక కల నిజమైనట్టుగా అనిపిస్తోందని చెప్పారు. సూర్యకుమార్ యాదవ్ 2021 మార్చి 14న అహ్మదాబాద్‌లో ఇంగ్లాండ్ జట్టుతో జరిగిన ఇరవై ఓవర్ల మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేశారు. అప్పటికి ఆయన వయసు 30 సంవత్సరాలు 181 రోజులు. ఆ మ్యాచ్‌తో ప్రారంభమైన ఆయన అంతర్జాతీయ ప్రయాణం విజయవంతంగా కొనసాగుతోంది. ఇప్పటివరకు ఇరవై ఓవర్ల క్రికెట్‌లో 113 మ్యాచ్‌లు ఆడి 3272 పరుగులు చేశారు. ఇందులో నాలుగు శతకాలు, 25 అర్ధ శతకాలు ఉన్నాయి. ఈ ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత బ్యాటర్లలో మూడో స్థానంలో నిలిచారు. ఆయన కంటే ముందుగా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఉన్నారు. వన్డే క్రికెట్‌లో 2021 జూలై 18న కొలంబోలో శ్రీలంకతో జరిగిన మ్యాచ్ ద్వారా అరంగేట్రం చేశారు. అనంతరం 2023లో నాగపూర్‌లో ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌తో టెస్టు క్రికెట్‌లో కూడా ప్రవేశించారు. అద్భుత ప్రదర్శనకు గాను 2022 సంవత్సరానికి గాను అంతర్జాతీయ క్రికెట్ మండలి అందించే సంవత్సరపు ఉత్తమ ఇరవై ఓవర్ల క్రికెటర్ పురస్కారాన్ని అందుకున్నారు. ఇటీవల ముగిసిన ప్రపంచ కప్ పోటీల్లో కూడా 242 పరుగులు చేసి జట్టుకు కీలకంగా నిలిచారు. తన ప్రయాణంలో సహచర ఆటగాళ్లు, అభిమానులు అందించిన మద్దతుకు సూర్యకుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

## గాయంతో హర్షిత్ రాణా ఐపీఎల్‌కు దూరం

**వేద న్యూస్ డెస్క్:**




ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందు కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జట్టు కీలక యువ పేసర్ హర్షిత్ రాణా మోకాలి గాయం కారణంగా ఈ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. ఈ నెల 28న టోర్నీ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ పరిణామం జట్టు బౌలింగ్ ప్రణాళికలపై ప్రభావం చూపే అవకాశం ఉందని భావిస్తున్నారు. గత ఫిబ్రవరిలో దక్షిణాఫ్రికా తో జరిగిన వార్మప్ మ్యాచ్ సమయంలో హర్షిత్ రాణా మోకాలికి గాయమైంది. అప్పటి నుంచి అతను ఆటకు దూరంగా ఉన్నాడు. ఐపీఎల్ ప్రారంభానికి ముందు పూర్తిగా కోలుకునే పరిస్థితి లేకపోవడంతో ఈ సీజన్‌కు అతను అందుబాటులో ఉండడంలేదని జట్టు వర్గాలు తెలిపాయి. అతని గైర్హాజరీ జట్టులోని ఇతర బౌలర్లకు అవకాశంగా మారుతుందని జట్టు అధికారులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఈ వార్తలు వెలువడకముందే కోల్‌కతా నైట్ రైడర్స్ తమ పేస్ దళాన్ని బలోపేతం చేసింది. జింబాబ్వేకు చెందిన వేగవంతమైన బౌలర్ బ్లెస్సింగ్ ముజరబానీని జట్టులోకి చేర్చుకున్నట్లు ప్రకటించింది. ఆరు అడుగుల ఎనిమిది అంగుళాల ఎత్తుతో ఉన్న ఈ కుడిచేతి ఫాస్ట్ బౌలర్ తన వేగం, బౌన్స్‌తో ప్రత్యర్థి బ్యాటర్లకు సవాల్‌గా నిలుస్తాడని జట్టు యాజమాన్యం తెలిపింది.

Edited, Printed, Published and Owned by Lingabatthini Krishna Printed at Bhavani Enterprises, H.No 16-6-198/B, Perukawada, Warangal, 506002, Telangana State. Published at H.No. 17-3-180, Near Rama Swamy Temple, Warangal Dist, 506002 Telangana State. Editor : Lingabatthini Krishna, Phone : 9701923260. e-Mail : vedhanews22@gmail.com. RNI No : TELTEL/2022/83073